# గానకళ

సంగీత మాసపత్రిక

#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్: 9441488721



సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాథరావు**

విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి.బ్రహ్మానందం,**

విజయవాడ, విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల

**శ్రీ మండలీక సీతారాఘవరావు,** చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి,** కాకినాడ

అసోసియేట్ ఎడిటర్స్

**శ్రీ ధర్మాల రామమూర్తి**

(హైదరాబాద్)

**డా॥ బి.యస్.వి.ప్రసాద్,**

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మృదంగం

కాశీవిశ్వవిద్యాలయం, వారణాసి.



**సంపుటి -59** **జులై, ఆగష్టు, సెప్టెంబరు - 2020** **సంచిక - 01,2,3**



**సంపాదకవర్గం :**

శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


పేజిలలో ఈ సంచికలో...


**2.** సంగీత సామ్రాట్ శ్రీ ఎమ్.ఎస్.బాలసుబ్రహ్మణ్యశర్మ సంస్మరణ - డాక్టర్ శివకుమార్ నందనవనం

**9.** "స్వగతం" - శ్రీ మల్లాది సూరిబాబు

**12** లాల్గుడి జయరామన్ గారికి స్మృత్యంజలి - శ్రీ ఆలమూరు విజయభాస్కర్

**14.** ప్రజ్ఞావంతులు శ్రీ డి.వి మోహనకృష్ణ- శ్రీ మోదుమూడి సుధాకర్

**16.** కృష్ణమాచార్య ధిషణాహేల - శ్రీ కొమాండూరి శేషాద్రి

**18.** ఫిడేలు నాయుడు - శ్రీమతి ఎస్.సల్మా

**20.** మనసులోని మర్మములు తెలిపిన త్యాగరాజు - శ్రీమతి గుంటూరు అన్నపూర్ణ

**22.** వాగ్గేయకారులు శివస్తుతి కీర్తనలు **34-** శ్రీమతి సి.ఉమాదేవి.

**24.** నేనెరిగిన ప్రతిభాశాలి 'విజయామామి' - శ్రీ మల్లాది రామ్‌ప్రసాదు


## ముఖచిత్రం

1. సంగీత సామ్రాట్ శ్రీ ఎమ్.ఎస్.బాలసుబ్రహ్మణ్యశర్మ జయంతి సందర్భంగా సంస్మరణ ఉత్సవాలను శిష్యప్రశిష్యులు నిర్వహిస్తున్నారు.
2. సంకీర్తన కల్చరల్‌సొసైటీ వారు సితార్ విద్వాంసులు పండిట్ రవిశంకర్ సెంటినరీ సెలబ్రేషన్స్ సందర్భంగా సితార్ విద్వాంసులు శ్రీ జనార్ధన్ మిట్ట గారిని సత్కరిస్తున్న దృశ్యం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

(జయంతి వేడుకల ప్రత్యేక కథనం)

# సంగీత సమ్రాట్ స్వర్గీయ శ్రీ ఎం. ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ 'సంగీత సాహితీ వైశిష్ట్యం'

మానవుని యొక్క మనసును రంజింపజేసి ఆనందానుభూతిని కల్గించి మనోవికాసమునకు తోడ్పడునవి కళలు. ఇవి అరువది నాలుగని (64) పండితుల ఉవాచ. ఈ అరువది నాలుగు కళలలో కూడా ముఖ్యముగా చెప్పదగినవి అయిదు (5). అవి – సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం. వీనినే లలిత కళలని కూడా అంటారు. ఈ ఐదింటిలోను ముందు వరుసలో ఉన్నవి సంగీతం – సాహిత్యం. **"సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం. . . . . . ఏకమాపాతమధురం అన్యదాలోచనామృతం"** అని ఆర్యోక్తి. దీనినిబట్టి సంగీతము అపాత మధురమని, సరస్వతీ స్వరూపమని తెలుస్తుంది. అదే విధంగా **"శిశుర్వేత్తి పశు ర్వేత్తి, వేత్తి గానం రసం ఫణిః"** అని పండితుల ఉవాచ. అంటే ఆబాలగోపాలాన్ని అలరింపజేసేదీ, శిశువులనూ, మనుషులనే గాక జంతుజాలమునూ ఆకర్షించునటువంటి కళ సంగీతము. ఈ సంగీత విద్యలో "ఎందరో మహానుభావులు" తమ జీవితాల్ని ఆ కళకే అంకితము చేసి పునీతులైనారు. ఆధునిక యుగములో ఈ సంగీత కళకు తన జీవితాన్ని అంకితము చేసి ఎందరికో గురువుగా ఉండి ఆంధ్రరాష్ట్రమునకే గాక, భారత దేశమునకే కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిన మహనీయులు 'సంగీత సమ్రాట్' గా ఖ్యాతి గడించిన వారు శ్రీ మామిళ్ళపల్లి సూర్య బాలసుబ్రహ్మణ్య శర్మ. అటువంటి ప్రముఖ వ్యక్తి సంగీత ప్రపంచానికి మాత్రమే గాక సాహిత్య లోకానికి సైతం ఎంతో దగ్గరివాడని చెప్పవచ్చు. ఇందుకు ఆయన చేసిన రచనలే ప్రధానం. ఆయా రచనలు వాటి విశిష్ఠతను మనం నేడు తెలుసుకుందాం. ఇందులో భాగంగా ముందుగా ఆయన జీవిత విశేషాలు క్లుప్తంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆ వివరాలలోకి వెళితే ఆయన గోదావరి పుణ్యనదీ జలాలతో పవిత్రమైన నగరం, సంగీత సాహిత్య కళలకు ఆలవాలమైన రాజమహేంద్రవరం. నేటి రాజమండ్రి. అటువంటి **రాజమహేంద్రవరము నందు శ్రీయుత మామిళ్ళపల్లి సోదెమ్మ, కొండయ్య దంపతులకు మూడవ (3వ) సంతానముగా 1929వ సంవత్సరం సెప్టెంబరు 17వ తేదీన జన్మించారు.**

చిన్న వయసులోనే తల్లిదండ్రులు మరణించగా అన్నగారి పోషణలో పెరుగుచున్న బాలసుబ్రహ్మణ్య శర్మ ఎనిమిది ఏళ్ళ వయస్సులో తన బావగారి ప్రోత్సాహంతో సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు శ్రీ పైడిస్వామిగారి శిక్షణలో సంగీతమునందు ఓ......న......మ.....లు నేర్చుకున్నారు. తన శిష్యుని గానమునకు ముగ్ధులైన గురువుగారు వీరి 10వ ఏటనే మొదటి సారిగా ఒక హార్మోనియం షాపులో "కచ్చేరీ" ఏర్పాటు చేసారు. వీరి గాన మాధుర్యమునకు రసజ్ఞులైన ప్రేక్షకులు ఒక "శృతి హార్మోనియం" ను బహుకరించారు. 13వ యేట వీరి గానకౌశలాన్ని గుర్తించిన మద్రాసు (చెన్నై) ఆలిండియా రేడియోవారు "ఎ" గ్రేడు ఆర్టిస్టుగా గుర్తించి వీరిగాన కచ్చేరీలను ప్రసారంచేయసాగారు. శర్మగారి 22వ ఏటనే అనగా 1948వ సంవత్సరంలో కాకినాడ వాస్తవ్యులు శ్రీ గౌడు అవతారం, నిర్మలగార్ల కుమార్తె సత్యవతి (16 సం॥)తో వివాహము జరిగినది. ఈ వివాహము జరిపించుటలో ప్రధాన పాత్ర వహించినవారు వీరి గురువుగారు పైడిస్వామి గారు.

సంగీతంలో ఆధ్యాత్మిక పరంగా దైవస్తుతి చేస్తుండే సాహిత్య రచనలే ఎక్కువగా ఉంటాయి. ఈ విషయాన్ని పరిశీలనా దృష్టితో చూడగా ప్రాచీన కాలం నుండీ

వాగ్గేయకారులుగా కీర్తింపబడిన పురందరదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య మరియూ సంగీత త్రిమూర్తులుగా కీర్తి గడించిన త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితుల వారి రచనల ద్వారా తెలుస్తుంది. శర్మగారు కూడా అదే కోవలో ఆధ్యాత్మిక పరమైన ఎన్నో సాహిత్య రచనలు చేశారు. దీనిని బట్టి వీరి రచనలు ఆధ్యాత్మిక సాహిత్యానికి సంబంధించినవిగా చెప్పొచ్చు. వీరిగాన మాధుర్యమునకు మెచ్చిన ఆకాశవాణి కేంద్రముల వారు జనరంజని ప్రత్యేక కార్యక్రమములలో కూడా వీరి సంగీత కచ్చేరీలను ప్రసారం చేయసాగారు.

ఆ రోజులలో అంటే శర్మ సంగీత విద్యలో ఎంతో రాణింపు పొందుతూ కేవలము సంగీతమునకే పరిమితముగాక సాహిత్యంలో గూడా తన ప్రతిభా పాటవాలను చూపించారు. సంగీతానికి సంబంధించిన అనేక రాగాలలో 12 కృతులు, 1 తత్వము, 3 తిల్లానాలు రచించారు. వీటిని వీరి మరణానంతరము వీరి శిష్యులైన శ్రీ కె.వి. బ్రహ్మానందం 2005 వ సంవత్సరము నవంబరు 30 వ తేదీన జరిపిన 3వ వర్ధంతి సభలో విజయవాడలో పుస్తక రూపంలో విడుదల చేశారు.

వీటిలో 12 కృతుల్ని పరిశీలిస్తే పన్నెండు రత్నాల్లాంటివి ద్వాదశ కృతులుగా పేర్కొనవచ్చును. వీరి కృతులలో తప్పనిసరిగా వీరి పేరు "ముద్రిక"గా ఉంటుంది. దీనిని బట్టి ఇవి వీరి స్వీయ రచనలు అని స్పష్టంగా తెలుస్తుంది. ఆ 12 కృతులు గురించి పరిశీలించినట్లైతే .

ఈయన మొదటి కృతి "సరస్వతి నమోస్తుతే " అంటూ ఈ కృతిని సరస్వతి రాగం - రూపకతాళంలో స్వరపరచారు.

**రెండవ కృతి బా ల సు బ్ర హ్మ ణ్యా గ్ర జం భ జే ॥ భ వ బం ధ మో చ నీ పా . . వ . . నీ** అంటూ సాగుతుంది. ఈ కృతిని రేవతి రాగం ఆది తాళంలో శ్రీ శర్మ స్వరపరచారు..

**ఇక మూడవ కృతి** మన్నింప గదే మా దోష ము ల ను ॥ మ ము ద య జూడుము మామిళ్ళ మ్మా అంటూ కళ్యాణి రాగం - ఆదితాళం లో స్వరపరచారు. బాలసుబ్రహ్మణ్య శర్మ గారు సందర్భానుచితముగా కృతులు రచించేవారు. ఒక మారు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గ్రామమునందు మామిళ్ళమ్మ ఉత్సవాలు జరిగినవి. ఆ ఉత్సవములకు కచేరీ నిర్వహించుటకు శ్రీ శర్మగారిని ఆహ్వానించారు. కచ్చేరీ ప్రారంభమయినది. శర్మగారి ఇంటిపేరు మామిళ్ళపల్లి వారు. అక్కడ దేవత మామిళ్ళమ్మ. దీనిని పురస్కరించుకొని మామిళ్ళమ్మను తమ ఇలవేలుపుగా భావించుకొని ఆశువుగా కృతిని రచించి కళ్యాణి రాగంలో ఆలాపన చేశారు. ఈ కళ్యాణి రాగము 65వ మేళకర్త రాగాంగము. ఇది సంపూర్ణ రాగము. పగలు 12 గంటలు మొదలు సాయంత్రం 3 గంటల వరకు పాడదగినది.

**ఇక నాల్గవ కృతి** 'కరుణా జూడవే కన్యా కుమారి కరుణ జూడవే' అంటూ సాగుతుంది. ఈ కృతిని శర్మగారు సావేరి రాగం - ఆదితాళంలో స్వరపరచారు. ఆనాటి సంగీత కచ్చేరిలో ఇదే కృతిని సావేరీ రాగంలో ఆలాపన చేశారు.ఈ సావేరీ రాగము ఉపాంగరాగము. ఔడవ సంపూర్ణరక్తి రాగము. 15వ మేళకర్త మాయామాళవ గౌళరాగము నందు పుట్టినది. శర్మగారికి సంగీతములో గల అనుభవసారమెట్టిదో, తెలుస్తున్నది. సాయంత్రం 6 గంటలు మొదలు రాత్రి 9 గంటల వరకూ పాడదగినది.

**వీరి ఐదవ కృతి** సుచరిత్ర రాగం - ఆదితాళంలో ఆలపించారు. ఇది సందర్భానుసార రచన. తను కచ్చేరికి వెళ్ళినప్పుడు అచ్చట నున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూసిన శర్మగారు స్వామి వారి విగ్రహాన్ని చూచిన ఆనందంలో ఆశువుగా ఆంజనేయ స్వామిని స్తుతిస్తూ సుచరిత్ర రాగంలో ఆలాపన చేశారు. ఈ సుచరిత్రరాగము 67వ మేళకర్తరాగము. ఇది సంపూర్ణ రాగము.

**ఈయన ఆరవ కృతి** విజయ శంకరి రాగం - ఆదితాళంలో స్వరపరచారు. ఇందులో 'శ్రీ విజయశంకరీ ఆశ్రితజన శుభకరి'. ఇదేరీతిలో 1971 వ సంవత్సరము ఆగష్టు 22వ తేదీన రాజమహేంద్రవరము నందు విజయశంకర సంగీత కళాశాలను ప్రారంభించటం జరిగినది. ఆ కళాశాలకు మొదటి ప్రిన్సిపల్‌గా శర్మగారే నియమించబడినారు. ప్రారంభోత్సవ సందర్భంలో జరిగిన సంగీత కచ్చేరీనందు ఆశువుగా కృతిని రచించి "విజయ శంకర" అను పేరు గల సంగీత కళాశాల అగుట వలన వీరు "విజయశంకరీ, ఆశ్రిత జనశుభకరి" పల్లవితో ప్రారంభమై "సర్వరోగ నివారిణీ అంబా" అనుపల్లవితో గూడి సరీమాదనీయను పంచాక్షర రూపిణీ, భక్తపాలినీ బాలసుబ్రహ్మణ్యునిదే బ్రోవుము" భారమా కేదారేశ్వర ప్రియకరి" అంటూ చరణంతో పూర్తవుతుంది. అంతేగాక ఈ కళాశాల వ్యవస్థాపకులు శ్రీ నార్నికేదారేశ్వరుడు గారిని చరణంలో చివరగా ''కేదారేశ్వర ప్రియకరి'' అని సంబోధించుటలో వీరు ఆ కళాశాల నిర్వహణలో పోషిస్తున్న పాత్రలు మూడింటిని దృష్టిలో పెట్టుకొని రచన గావించినట్లుగా తెలుస్తున్నది. (కళాశాల వ్యవస్థాపకులుగా, ప్రధాన కార్యదర్శిగా మరియు కన్వీనరుగా) ఇది వారి మనోధర్మ సంగీతాన్ని, అలవోకగా సందర్భానుసార సాహిత్య రచనాధోరణికి ప్రతీకగా చెప్పవచ్చును. ఈ విజయశంకరి రాగం 59వ మేళ కర్తయగు ధర్మవతి రాగజన్యము.

ఈయన **ఏడవ కృతిని** షణ్ముఖప్రియ రాగం - ఆదితాళంలో కూర్చారు. రా . జే శ్వ రి స్వా మి నం భ . జే . . . హం . . .రా . జే . శ్వ రి స హి తం, సం. . . త . తం ...... ఇదే విధంగా కరీంనగర్ జిల్లా వేముల వాడలో నున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవ సందర్భముగా వీరి సంగీత కచ్చేరీ ఏర్పాటు చేశారు. ఆనాటి కార్యక్రమానికి, తన ప్రియ శిష్యుడైన బ్రహ్మానందంతో కలసి బస్సులో ప్రయాణం చేస్తూ ఆశువుగా అమ్మవారిపై "శ్రీరాజరాజేశ్వరీ" కృతిని రచించారు. అదే కృతిని ఆనాటి సభలో షణ్ముఖ ప్రియరాగంలో ఆలాపన చేసి శ్రోతలకు రసానుభూతిని కల్గించారు. ఈ షణ్ముఖ ప్రియరాగము 56వ మేళ కర్తరాగము.

**ఎనిమిదవ కృతిలో** 'యా దగిరి నిల యా ఏలద యరాదు ॥ యదువంశ ప్రభో సాదులోక విభో' అంటూ సాగుతుంది. ఆ సందర్భంగా జరిగిన కచ్చేరీ నందు ఆశువుగా స్వామి వారిపై కృతిని రచించి కానడ రాగం ఆదితాళంలో ఆలాపన చేశారు. ఈ కృతి స్వామి వారు అవతార పురుషుడుగా నృసింహావతారుడై స్థంభమునుండీ ఉద్భవించి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని బ్రోచిన వైనము, ఆ దివ్య స్వరూపము కనులకు గట్టినట్లుగా తోచును. మరియూ ఈ కృతిలోని చరణములో "భవసాగరమున బాధలు జెందితి, పరిపరి విధముల నిను నే పిలిచితి" అని రచన చేయుటలో వీరు పడిన సంసార ఈతిబాధలు తొలగించుటకై నృసింహస్వామి పాదారవిందాలను శరణుకోరుచూ ప్రార్థించినట్లుగా తెలుస్తున్నది. ఈ కానడరాగము 22వ మేళకర్తయగు ఖరహర ప్రియరాగజన్యము. ఈ విధముగా సందర్భానుసార రచనా కృతులేగాక సహజముగా రచించిన కృతులు పరిశీలించినచో వీరు తిరుపతిలోని సంగీత కళాశాలల్లో, విశ్వవిద్యాలయంలో పనిచేసిన కాలములో బహుశా రచించి ఉండవచ్చునేమోనని తెలియుచున్నది.

**వీరి తొమ్మిదవ కృతి** హేమవతిరాగం - ఆదితాళం లో రచించారు. దీనిలో "ఎంతకాలమని నేతాళు దునే ఇంతీ గిరి తనయ హైమావతీ" పల్లవితో ప్రారంభించిన ఈ కృతి అనుపల్లవి తర్వాత చరణములో "దారసుతులకై ధనమార్జించితి సారములేని సంసారమున బడితి" అంటూ రచించారు. ఈ హేమవతి రాగం 58వ మేళ కర్త రాగము. ఇది సంపూర్ణ రాగము.

**ఈయన పదవ కృతిగా** శ్రీ వెంకటేశ్వరుని స్తుతిస్తూ "శ్రీవెంకటేశ్వర శ్రితజన రక్షకా" పల్లవితో ప్రారంభించి, అనుపల్లవి తర్వాత చరణములో చివరగా "భవ్య చరితశ్రీ బాలసుబ్రహ్మణ్యనుత" అని రచన చేయుటలో వీరు ఉపయోగించిన "భవ్యచరితశ్రీ" అను పదము ద్వంద్వార్థ ప్రధానముగా ఉపయోగించినందున ఎంతో ఘన చరిత్రము గల్గిన వెంకటేశ్వరుని సంబోధన మరియూ ఆనాటికే వీరికి సంగీత ప్రపంచంలో ఎంతో ఉన్నతమైన కీర్తి ప్రతిష్టలు కలిగిన వైనము తెలుస్తున్నది. ఈ కృతిని శ్రీ శర్మ పూర్వ కళ్యాణి రాగంలో ఆలాపన చేశారు.

**పదకొండవ కృతిని** దుందుభి ప్రియరాగం - రూపకతాళంలో గానం చేసారు. వీరు ఆకాశవాణి విజయవాడ కేంద్రములో కచ్చేరీ పాడటానికి వచ్చిన సమయంలో శ్రీ బెజవాడ కనకదుర్గ ఆలయమును దర్శించుకొని ఆ శక్తి స్వరూపిణిపై "సదా తవపాదయుగం సరిగ నమ్మినాను తల్లి" పల్లవితో ప్రారంభించి, చరణము, పైకాల సాహిత్యం, చిట్టస్వరం, త్రిశగతితో కూడిన కృతిని రచించారు. చరణం ప్రారంభంలోని "దుందుభిరాగపోషిణీ" అంటూ దుందుభి ప్రియరాగంలోని స్వరమును కూర్చడం వీరి సాహిత్య, సంగీత పాండిత్యాలకు నిదర్శనంగా పేర్కొనవచ్చు.

**పన్నెండవ కృతిలో** 'పాలించు శ్రీహరే పద్మనాభ మురారే' అంటూ ఆలపించారు. శ్రీ శర్మగారు సింహేంద్రమధ్యమరాగంలో (57వ మేళ కర్తరాగము) రూపకతాళంలో మరోకృతిని రచించారు. ఇది సంపూర్ణరక్తిరాగము. రాగాంగరాగము.

ఈ ద్వాదశ కృతులేగాక వీరియొక్క తాత్విక చింతనకు మూలము అన్నట్లు ఒక తత్వము కూడా రచించారు. జనపదులందున్న "జీవులెనుబదినాల్గు లక్షల చావుపుట్టుకలిక్కడ" అను మాటల నాధారముగా జేసుకొని, జీవితానుభవమును జోడించుకొని తత్వమును రచించినట్లుగా తెలియుచున్నది. ఈ తత్వములో నేటిసమాజములో జరుగుచున్న అనేకములైన స్వార్థపరుల భావములను, తెలియజేయుచూ వాటికి పరలోకమున విధించు శిక్షలను కూడా పేర్కొనటం జరిగినది. ఈ కీర్తన మానవులలోని మంచి తనం, వారియొక్క స్వభావం కూడా తెలియజేస్తూ వారు భక్తితో పొందే ముక్తిమార్గమును కూడా తెలియజేశారు. దీనిని శ్రీశర్మ నాదనామక్రియ రాగంలో మిశ్రచాపుతాళంలో రచనచేసి ఆలపించెడివారు. ఇది వారియోగచింతనా, దృష్టికి తార్కాణంగా పేర్కొనవచ్చు. ఈనాదనామ క్రియరాగం 15వ మేళ కర్తయగు మాయామాళవగౌళ రాగజన్యము.

తత్త్వముతోబాటు వీరు తిల్లానాలు కూడా రచించారు. వీరు రచించిన తిల్లానాలు (3) మూడు. అందు **మొదటి తిల్లానా** నందు సప్తగిరి వాసుడైన శ్రీనివాసుని స్తుతించడం జరిగింది. చివరగా "బాలసుబ్రహ్మణ్యుని బ్రోవుము" అని స్తుతించారు. ఈ తిల్లానాను ఉదయరవిచంద్రికరాగం - ఆదితాళంలో కూర్చారు. ఇది 22వ మేళకర్తయగు ఖరహరప్రియరాగ జన్యము. ఇది అన్ని వేళలయందు పాడదగినది.

అదే విధముగా **రెండవ తిల్లానాయందు** పార్వతీదేవిని తలచుచూ శివరంజనీ రాగములో రచించి ఆదితాళంలో ఆలాపనచేశారు. "సకల కళాపరిపూర్ణుడైన సర్వేశ్వరునికి రాణివే చికాకు నాపై ఏలనే శివరంజనీ బాల సుబ్రహ్మణ్య జననీ" అని స్తుతిస్తూ శివరంజనీరాగంలో ఆలాపన చేశారు.

అదే విధముగా **మూడవ తిల్లానాయందు** పార్వతీ దేవిని సంగీత రూపిణిగా పేర్కొంటూ రసిక ప్రియరాగంలో రచించి ఆదితాళంలో ఆలపించారు. ఇది 72వ మేళకర్త రాగము. ఇది సంపూర్ణ రాగము.

సందర్భానుసార రచనా కృతులు :- వీరి సాహిత్య రచనా ధోరణి పరిశీలించినట్లయితే సంసార సాగరంలో

క్షణికానంద భరితములైన ఇహలోక సౌఖ్యముల కన్నా శాశ్వతానంద భరితములైన దైవత్వాన్ని చేరుకోవాలనే వీరి తపన, వీరి మనస్తత్వము వీరి మాటలలో గోచరిస్తాయి. వీరు చేసిన కృతులు, రచనలు ఆయాప్రాంత సందర్భన సంధర్భాలలో అప్పటికప్పుడు అలవోకగా ఆశువుగా వ్రాయబడినట్లుగా చెప్తుంటారు ఉదాహరణకు ఒక సారి శర్మగారు తన శిష్యుడైన కె.వి. బ్రహ్మానందంతో కలిసి విజయవాడ నుండీ బయలుదేరి కరీంనగర్ జిల్లా వేముల వాడలో జరిగే కచ్చేరీకి బస్సులో బయలుదేరి ప్రయాణం చేస్తూ"మన్నింపగదే మాదోషములను" – (కళ్యాణిరాగంలో) అను కృతిని స్వరపరచినట్లుగా కె.వి. బ్రహ్మానందం గారితో జరిపిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

1971 సంవత్సరంలో రాజమహేంద్రవరంలో "విజయ శంకర సంగీత కళాశాల ప్రారంభోత్సవ సందర్భముగా" "శ్రీ విజయ శంకరీ ఆశ్రితజన శుభకరీ" అను కృతిని రచించి "విజయ శంకరి" అనే క్రొత్త రాగంను స్వరపరచి వాగ్గేయకారుడిగా నిరూపించుకున్నారు.

వీరు నృసింహస్వామి భక్తులుగా తెలియుచున్నది. వీరు ఆదిశంకరాచార్య విరచితమైన సంస్కృత ప్రణీతమైన **"శ్రీ లక్ష్మీనృశింహ కరావలంబ స్తోత్రమ్"** ను స్వరపరచి గానం చేసిన వైనాన్ని పరిశీలిస్తే, వీరికి సంగీతంపైనే గాక సాహిత్యంపై గల మక్కువ తెలుస్తుంది. వీరు స్వరపరచి గానంచేసిన "శ్రీ లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రమ్"ను "స్తోత్రమంజరి" పేర ఆకాశవాణి, విజయవాడ కేంద్రం వారు రికార్డు చేసి విడుదల చేసిన క్యాసెట్స్ కూడా అన్ని ఆకాశవాణి కేంద్రాలలో మనకు లభ్యమవుతున్నాయి. మరియూ "భక్తిరంజని" కార్యక్రమంలో కూడా నేటికి ప్రసారం చేయుచున్నారు.

సంగీత సమ్రాట్ గా శర్మ:– సంగీత సాహిత్యాలలో శ్రీ శర్మగారిని గురించి పరిశీలించినచో వారు ప్రయోగించిన సంగీత పోకడలను బట్టి ప్రముఖ వాగ్గేయకారుడుగా కూడా పేర్కొనవచ్చును. పేరొందిన వాగ్గేయకారులే ఆలపించ గలరనుకున్న అపురూప రాగాలను సైతం వీరు గానం చేసి "సంగీత సమ్రాట్" గా చరిత్రలో నిలిచిపోయారు. గతిభేద పల్లవి పాడటంలో, అంటే గతులు మార్చి మార్చి పాడటం ఈయన ప్రత్యేకత. చిన్నతనం నుండీ ఈయన సంగీతంలోని మెళకువలపై శ్రద్ధ కనబరచేవారు. వీరు సుమారు ఆరున్నర దశాబ్దాలపాటు సంగీత విద్వాంసుడిగా పేరు గడించి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతగానేకాక ఎన్నో మరెన్నో సన్మానాది పురస్కారములు, అవార్డులు పొంది, ప్రముఖుల చేత కీర్తింపబడి "సంగీత సరస్వతి ముద్దుబిడ్డ" గా నిల్చిపోయారు.

సంగీత శాస్త్రములో వీరికి గల ప్రతిభ ఎటువంటిదంటే "పరాకు చేసిన నీకేమి ఫలము కలిగెరా" అను కృతి జుజావాళిరాగం 13వ మేళకర్త, గాయకప్రియరాగ జన్యం కానీ సెమ్మంగుడి వారి అభిప్రాయం ప్రకారం హరికాంభోజీరాగమనీ చెప్పారు. కానీ శర్మగారు మాత్రం 13వ మేళకర్త రాగం ప్రకారమే తాను ఆలాపన చేస్తానని చెబుతారు. దీనికి ఆరోహణ – సమగపదనిస, అవరోహణ – సదనిదపమగస అని చెప్పారు.

ఇదే రీతిగా పదకవితా పితామహుడుగా పేర్గాంచిన తాళ్ళపాక అన్నమాచార్యులు రచించిన **"కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు. కొండలంత వరములు గుప్పెడువాడు"** అను సంకీర్తనమునకు పరిష్కర్తలు సామంతరాగమును పేర్కొనగా శర్మ గారు మాత్రం ఈ సంకీర్తనను హిందోళరాగం ఆదితాళంలో (3) గానం చేసి సంగీత కర్తగా నిరూపించుకున్నారు. ఇది వారి సంగీత ప్రతిభకు నిదర్శనముగా పేర్కొనవచ్చును. ఈనాడు ఈ రాగముతోనే ఈ సంకీర్తన బహుళ ప్రచారమునొందినది. "అన్నమాచార్య కళాసాగర" బిరుదముతో సత్కరించి సన్మానించి వారి విశిష్టతను

చాటారు. అదే సంవత్సరము డిసెంబరు 5వ తేదీన విజయవాడ శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి కమిటీ ప్రాజెక్టు వారు కూడా దీనికే ప్రాధాన్యతనిచ్చారు. శ్రీ శర్మగారు ప్రముఖ వాగ్గేయ కారులైన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి మొదలైన వారి కీర్తనలను కృతులను కంఠస్థము చేసి సాంప్రదాయబద్ధముగా గానం చేసేవారు

త్యాగరాజు పాత్రలో శర్మ : శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ఆధ్వర్యంలో తే10-2-1971దిన "శ్రీసద్గురు త్యాగరాజు" అను సంగీత నాటకం రాజమహేంద్రవరము నందు ప్రదర్శించబడినది. ఆ నాటకమునకు సంగీతమును సమకూర్చి ప్రధాన భూమిక అయిన త్యాగరాజు పాత్రను పోషించి "అభినవ త్యాగరాజు"గా గణుతికెక్కారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం వారు ప్రతిరోజూ ప్రసారం చేసినటువంటి "సంగీత శిక్షణ" కార్యక్రమంలో శ్రీ శర్మగారు గురువుపాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆకాశవాణి కేంద్రం నుంచి వెలువడిన ఈ సంగీత కార్యక్రమమును విని అనేకులు సంగీతముపై అభిమానము పెంచుకొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులకు సంగీతము సులభంగా నేర్చుకొను రీతులను తెలిపారు.

వీరి సంగీత కచ్చేరీలు శ్రోతలను సంగీతములో ఓలలాడించినవి. సంగీత విషయములో ఈయన మనోధర్మ సంగీతం ప్రకారం ఎన్నయినా సంగతులు వేయవచ్చునంటారు. వీరు సంగతులు వేయటంలో రకరకాల విన్యాసాలు చేసేవారు. గమకాలు, అదీ తికమక గమకాలు వేయటంలో సుప్రసిద్దులు. వీరి రకరకాల సంగతులు, విన్యాసాలకు తగినట్లుగా సహచర్యం చేసే ప్రక్క వాయిద్యాల వారు చాలా కష్టపడవలసి వచ్చేది. విస్తృత రాగాలాపన చేయునపుడు అందులో లీనమై పోయేవారు. **"శ్రీ లక్ష్మీనృశింహ కరావలంబ స్తోత్రమ్"** గానం చేస్తుంటే శ్రీ నృసింహావతార పురుషుని హృదయాన్ని వెళ్ళి తాకుతుందని ప్రశస్తి. ఈ స్తోత్ర గానములో ఒక్కొక్క మారు శర్మగారి కళ్ళు చెమర్చేవి. ఈ స్తోత్రము వీరి ద్వారా ఎంతో ప్రాచుర్యం పొందినది. శర్మగారు ఎచ్చట కచ్చేరి చేసినా కూడా శ్రోతలు ఈ స్తోత్రమును తప్పని సరిగా పాడించుకొనేవారు. తరువాత హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డు కంపెనీ వారు ఈ సోత్రమును రికార్డు చేసి భద్రపరిచారు. ఆకాశవాణి కేంద్రంలో భక్తిరంజనీ కార్యక్రమంలో ఈ స్తోత్రం ఈనాటికీ కూడా ప్రసారం చేయుచున్నారు.

వీరి గానమును ప్రజల కందించాలనే తలంపుతో శర్మగారి కీర్తనలను రికార్డు చేసి "ఆనందదాయినీ" అను పేరుతో క్యాసెట్ విడుదల చేశారు. ఆ సంగీతము ఈనాటికీ సంగీత ప్రియులను ఆనందడోలికల్లో ఓలలాడింపజేస్తుంది, మరియు ఆనందాను భూతి కల్గిస్తుందనుట అతిశయోక్తి కాదు.

ఈ రీతిగా శర్మగారికి సంగీత సాహిత్యములందు గల అభిమానం తెలియుచున్నది. వీరు పదవీ విరమణ చేసిన తర్వాత ప్రకాశం జిల్లా ఒంగోలులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని సంగీతంలో ఆసక్తిగల విద్యార్థులకు శిక్షణనిస్తూ ఎంతో మంది శిష్య, ప్రశిష్యులను తయారు చేశారు. వారిలో ప్రముఖంగా ఎస్. జానకి, ఎ.పి. కోమలి (సినీ నేపథ్య గాయనీమణులు), కె.వి.బ్రహ్మానందం, సీతావసంతలక్ష్మి, పి.సూర్యారావు, పింగళి ప్రభాకరరావు, జి. మధుసూధనరావు, రఘునాధ్ (అన్నమాచార్య ప్రాజెక్టు), సురేష్, కె.లలిత కళ్యాణి, పి.వి.ఎన్.సుధ, పి.అపర్ణ, ఐ.సీతారత్నంగుప్త, కదిరి నరసింహం, పి. మీరాదాసు (నాదస్వరం), ఆర్.నాగమణి (క్లారినెట్) తదితరులు ఎందరో మరెందరో నేటికి పలుచోట్ల సంగీత కచ్చేరీలను, దేశ విదేశాలలో నిర్వహిస్తూ, పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారు. ఇలా తన శిష్యబృదం యొక్క రేడియో, దూరదర్శన్‌లలో వచ్చే సంగీత సాహిత్య కార్యక్రమాలను తిలకిస్తూ






ఆనందించేవారు. మరియూ ఆకాశవాణి, దూరదర్శన్‌లలో, పలుచోట్ల కచ్చేరీలు చేస్తూ కాలంగడిపేవారు. ఆ సమయములోనే ఆకాశవాణి విజయవాడ కేంద్రము వారి పిలుపు మేరకు కొన్ని అపురూప రాగాలలో కొన్ని కృతులను స్వరపరచుకొని సాధనచేసి ఆకాశవాణిలో కచ్చేరీ చేశారు. ఇదే వీరి యొక్క తుది కచ్చేరి అయింది. వయస్సు పైబడుట వలన తన 73వ ఏట అనగా 2002 సంవత్సరము నవంబరు 30 వ తేదీన రాత్రి దూరదర్శన్‌లో వస్తున్న సంగీత కార్యక్రమం చూస్తూ శ్రీ శర్మ భువినుండి దివికేగారు.

అటువంటి గొప్ప సంగీత విద్వాంసుల సంగీత సభలలో పాల్గొని తన్మయత్వము పొందిన ఓ ప్రేక్షకుడిగానే గాక, వారి సంగీత సాహిత్యములపై మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ పట్టాను పొందుకునే భాగ్యము కల్గిన నేను వారి జయంతి సందర్భంగా సంగీత సమ్రాట్ శ్రీ ఎం.ఎస్ బాలసుబ్రహ్మణ్య శర్మగారికి అందిస్తున్న అక్షర సుమాంజలి ఈ వ్యాసం వారి పాదాలకే అంకితం. . . . . . .

**డాక్టర్ శివ కుమార్ నందనవనం,**

చరవాణి : 9440233351

M.A., B.Ed., M.Phil., PhD., M.A.Litt., B.Ed., PGDCA

ఆంధ్రోపన్యాసకులు, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, ఒంగోలు, ప్రకాశం జిల్లా. మరియు అధ్యక్షులు, గురజాడ ఫౌండేషన్ (అమెరికా), ప్రకాశం జిల్లా, ఒంగోలు

# స్వగతం

మల్లాది సూరిబాబు, సెల్ : 9052765490



మన సనాతన సంప్రదాయంలో పెళ్ళివేడుకను, ఆడంబరంతో చేసే ఉత్సవంగా భావించడం కద్దు. పెళ్ళి హడావుడే వేరు. వధూవరుల ఎంపిక దగ్గర నుండి, పెళ్ళయ్యేవరకూ ఒకప్పుడు అన్నీ ఒక పద్ధతిలో చక్కని అవగాహనతో జరిగేవి. ప్రతి విషయం పెద్దలు ముందుగానే నిర్ణయించుకుని ఎక్కడా మాట పడకుండా, అనకుండా జాగ్రత్తపడేవారు. బంధుమిత్ర సపరివారమనే మాటకు అర్థమన్నట్లు కట్ట కట్టుకుని ఎక్కడి నుంచో అటు ఆడపెళ్ళివారి తరపు బంధువులు, యిటు మగపెళ్ళివారి వైపు వారు రెండురోజులు ముందుగానే వచ్చి సాయంచేసేవారు. వీధిలోగిళ్ళే కల్యాణ మంటపాలు, ఎత్తుగా విశాలమైన తాటాకు పందిళ్ళకు అలంకరించిన మావిడాకులతోరణాలు, అరటి స్తంభాల వరసతో శోభాయమానంగా సుగంధ పరిమళాలతో ఆ వీధి నిండి పోయేది.

ఏమా శోభ? ఎంత సందడి? వీధి అరుగులపై కూర్చుని పెళ్ళివారి బంధువులు చెప్పుకునే కబుర్లకు సమయం తెలిసేది కాదు. అర్ధరాత్రి ముహూర్త సమయం వరకూ నిద్ర మానుకుని, పెళ్ళి సమయానికి మొత్తం అదరూ కళకళ లాడుతూ కొత్త బట్టలతో ముస్తాబై ముసి ముసి నవ్వులతో ఆశీనులయ్యేవారు. వివాహ మహోత్సవానికి సరైన అర్థం చెప్పిన ఆ రోజులే వేరు – ఆనాటి పెద్దలకు పెళ్ళెంత ముఖ్యమో, విందు భోజనాల ఏర్పాట్లు కూడా అంతే ముఖ్యం యిప్పుడు ఈ రెండూ యాంత్రికమే.

ఆడపెళ్ళివారొకవైపు, మగ పెళ్ళివారొకవైపు కూర్చునే వారు. ఊళ్ళో వారంతా వచ్చారా లేదా అని వివరంగా తెలుసుకుని రానివారికి మరోమారు కబురంపి రా రమ్మని పిలిచి పంక్తిలో కూర్చోమనటం ఒకప్పుడు సంప్రదాయం. తాపీగా ఒకొక్క వంటకం రుచి చూస్తూ, శభాష్, అని, మెచ్చుకుని లొట్టలేస్తూ వడ్డించేవారిని కూడా అభినందిస్తూ సాగే ఆలనాటి పెళ్ళి విందు భోజనాలు, చాలాకాలంగా గుర్తుండి పోయేవి. వీనుల విందైన ఆనాటి విద్వాంసుల సంగీత కచేరీలు కూడా అలాగే ఎంతో కాలం గుర్తుండి పోయేవి. వారిలో అరియక్కుడి రామానుజయ్యంగార్, జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం, చెంబై వైద్యనాథ భాగవతార్, సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్‌లతో బాటు ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి, ఎమ్.ఎల్. వసంతకుమారి,రాధ–జయలక్ష్మి మొదలైన ఓ పాతిక మంది విద్వాంసులు ముఖ్యులు. శంకరాభరణం, కాంభోజి, కళ్యాణి, తోడి, ఖరహరప్రియ లాంటి రాగాలను సముద్రంలో ఈదులాడినట్లు పాడిన విద్వాంసులున్నారు.

నా బాల్యంలో ఏలూరులోని వైఎమ్‌హెచ్ఎ హాలులో విన్న సంగీత కచేరీలన్నీ నాకు, నాకుటుంబంలో వారికి సంగీతాభిరుచిని కలిగించినవే. మా ఒక్కరికే గాదు. ఊళ్ళో సంగీత రసజ్ఞులందరికీ అదో మరపురాని అనుభూతి.

సంగీతమూర్తి త్రయం వారి శిష్యవర్గంలోని మొదటి తరం వారందరూ భావితరానికి విద్వాంసులను తయారు చేసిన సమర్థులైన విద్వాంసులను తయారు చేసిన సద్గురువులే కావటం వల్ల సంప్రదాయ సంగీతం క్రమంగా అందరికీ చేరువైంది. మరే తేలిక బాణీలు తలెత్తని రోజులవి. శాస్త్రీయ సంగీతం పట్ల గౌరవం పెరగటంతో ప్రజల్లో వినికిడి పెరిగింది. త్యాగరాజకీర్తనలు గ్రామఫోన్ రికార్డుల్లో పెద్ద పెద్ద విద్వాంసుల చేత పాడించి రికార్డ్ చేశారు. ప్రచారం జోరందుకుంది. అలా పాడిన విద్వాంసులలో మహారాజపురం విశ్వనాథయ్యర్ ఒకడు. సుమధురమైన గాత్రం, అపారమైన మనోధర్మం ఆయన సొత్తు. కొన్ని దశాబ్దాలపాటు రసజ్ఞులకు వీనుల విందైన సంగీతం అందించి చరితార్థుడయ్యాడు.

నా పరమగురువు 'సంగీతకళానిధి' డా॥పినాకపాణి

తరచు విశ్వనాధయ్యర్ ప్రతిభా విశేషాలు, సోదాహరణపూర్వకంగా పాడి చెప్పేవారు. విశ్వనాధ అయ్యర్ అద్భుత మనోధర్మంతో పాడిన రాగాలలో మోహన, సావేరి, హిందోళ, వంటివి ముఖ్యమైనవి.

హిందూస్థానీ ఛాయలతో పాడవలసిన దర్బారీ కానడ, బేహాగ్, కాపి, పీలు, దేశ్‌లు అనన్య సామాన్యంగా పాడేసేవాడు. దర్బార్ రాగం ఆయన అభిమాన రాగం.

మనం వినే సంగీతం రెండురకాలు. పెద్దలు చూపించిన మార్గంలో, అంటే త్యాగరాజాది వాగ్గేయకారులు పాడటం ఒకటి. తాము పాడిందే సంప్రదాయమని భావించే పద్ధతి మరోటి.

దక్షిణాదిలో వినపించేదంతా ఒక బాణి. అదే తంజావూరి బాణీగా ప్రసిద్ధమైంది. అక్కడ నేర్చుకునేవారు, గానం చేసేవారు వారు అనుసరించే విధానం ఎక్కడ చూసినా విన్నా ఒక్కటే. తేలికపాటి బాణీలు వినరు, గౌరవించరు. తాను పాడినదే సంప్రదాయమనే విద్వాంసులున్నారు. వీరిది ఆలోచించి, గానం చేసే మరో పద్ధతి. అరియకుడి రామానుజయ్యంగార్, చెంబై వైద్యనాధ భాగవతార్, రామ్నాడ్ కృష్ణన్, సెమ్మంగుడి శ్రీనివాస్ అయ్యర్, జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం, ఎమ్ఎస్.సుబ్బులక్ష్మి, ఎమ్.ఎల్.వసంతకుమారి, పట్టమ్మాళ్ మొదలైన వారిదంతా ఒక సంప్రదాయం. వారి కీర్తన పాఠంలో చెప్పుకోతగిన మార్పులు కనిపించవు. ఒకేలా వినిపిస్తాయి. త్యాగయ్య గారి మొదటి శిష్యవర్గంలో వాలాజిపేట సోదరులు, తిల్లస్థానం, ఉమయాల్పురం సోదరుల వల్ల ప్రచారమై, అదొక సంప్రదాయమై నిలిచిపోయింది. ఈ మూడు జంటలు ఏయే కాలంలో ఎప్పుడెప్పుడు, ఎంతకాలం త్యాగయ్య దగ్గర ఉన్నారో, ఎన్నెన్ని పాఠాలు నేర్చారో తెలియదు.

కాని, త్యాగయ్య ఇద్దరేసి శిష్యులకు కలిపి బోధించే వారనీ, ఒక్కో జంటకు 200 కీర్తనలు నేర్పాడని చెప్తారు. చెప్పిన కీర్తనలు చెప్పకుండా అందరికీ కొత్త కీర్తనలే చెప్పేవారట.

120 జంట గాత్రాలకు 200 కీర్తనలు చొప్పున బోధించారంటే త్యాగరాజు తన జీవితంలో 24000 కీర్తనలు పాడి వుండాలి.

తిరువయ్యారులోని ప్రణతార్తి హరుని ఉత్సవాలు జరిగే వేళలో పల్లకీ ఉత్సవం జరిగేది. ఆ ఊరేగింపులో వెనక నడుస్తూ తంబురా శృతిని మేళవించుకుని త్యాగయ్య మొదటి శిష్యవర్గంలోని సుందరభాగవతార్, కృష్ణభాగవతార్ తమ శృతి 'పక్వమైన' గాత్రాలతో అద్భుతంగా చేసే గానానికి జనం పరవశులైపోయేవారట. తంజావూరు రామారావు (శెమ్మంగుడికి సమీప బంధువు) లాల్‌గుడి రామయ్యర్, సోజిరి సీతారామయ్య, తిరువత్తి యార్ వీణ కుప్పయ్య, అయ్యభాగవతార్, గణేశయ్యర్, శిష్య వర్గంలోని ప్రముఖులు.

అందరి లోనూ వీణకుప్పయ్యర్ ప్రజ్ఞావంతుడై త్యాగయ్య అభిమానం పొందిన విద్వాంసుడు.

త్యాగయ్య గారి దినచర్య శిష్యులతో కీర్తనలు వేదాధ్యయనం చేసినట్లుగా పాడించటమే. పాడగా పాడగా జీర్ణమై మనసుకు పట్టేసిన కీర్తనలు, మనోధర్మాన్ని పెంచుతాయి. స్వతంత్రమైన బాణీ ఏర్పడుతుందని ఆనాటి గురువుల నమ్మకం. మూసలో పోసినట్లుగా కాకుండా గాయకుని గాత్ర ధర్మాన్ని బట్టి ఆ కీర్తనల స్వరూపం మారుతుంది. పాతిక రకాల గమకాలున్నాయి. గాయకులందరు అన్ని గమకాలు తమ గొంతులో పలికించలేరు.

గురువు పాడినట్లుగా శిష్యులందరూ పాడలేకపోవచ్చు. స్వరాన్ని వారికి తగినట్లుగా మలుచుకుని పాడగలిగినప్పుడే వాటిలో వైవిధ్యం కనిపిస్తుంది.

ఏమార్పు,చేర్పులేకుండా వినబడేది సినిమాపాట. ఎన్నేళ్ళు గానో త్యాగరాజ కీర్తనలు వింటున్నాం. విసుగు జనించక పోవటానికి గాయకుల గాత్రాల్లో వైవిధ్యమే కారణం. ఎంత విన్నా, మళ్ళీ పరగడుపే. త్యాగరాజాది వాగ్గేయ కారుల్లోని విశేషమే యిది. గురుకుల వాసంలో, గురువును సేవించుకుంటూ, ఆకలేస్తే తినటం, నిద్రించడం

తప్ప, మిగిలిన సమయాలలో శిష్యులంతా సాధనే జీవితంగా బ్రతికిన వారికి సంగీతం కరతాలమలకమవటంలో ఆశ్చర్యమేముంది. సంగీతంలో గోరంత జ్ఞానముండి 'కొండంత పాండిత్యముందనుకునే గాయకులకు' ఈ విద్వాంసుల ప్రజ్ఞా విశేషాలే ప్రమాణాలు. దిక్సూచిలై నిలబడే కరదీపికలు.

గురుకుల వాసం చేస్తూ సంగీతాభ్యాసం చేసిన విద్వాంసుడు 'సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ మహారాజపురం విశ్వనాధయ్యర్ శిష్యుడు'. 1962 నాటి మాట. బాల్యంలో నేను ఏలూరులో చదువుకునే రోజుల్లో, యిళ్ళల్లో రేడియోలు లేనపుడు 'సెమ్మంగుడి' కచేరీ బడేటి వారిపార్కులో కమ్యూనిటీ రేడియోలో మొదటిసారి విన్నాను. మొదటిసారి కర్ణాటక సంగీత కచేరీ ఎలా ఉంటుందో అనుభవమైంది.

ఆనయ్య గారి 'ఇంత పరాకా' అనే కీర్తనతో చిన్న చినుకులా ప్రారంభమైన ఆయన గానం దట్టమైన మేఘాలావరించిన ఉత్తర క్షణంలో ఒక్కసారిగా కుండపోతగా కుంభవృష్టి వాన కురిసినట్లుగా మారిపోయింది. ఆనాటి ఆయన గానం ఈ రోజుకీ నా మనసులో అలా స్థిరమై నిలిచి పోయి గుర్తుండి పోయిందంటే నమ్మండి.

మాటకూ పాటకూ ఉన్న తేడా నాదం. పొడిపొడిగా కనిపించే మాటలను చదువుకుంటాం. పాటలా వినబడాలంటే ఆ మాటలన్నీ నాదాన్ని మోసుకుంటూ రావాలి. పాడే గాయకుడికి ముందు ఈ నాదసుధారసమంటే ఏమిటో తెలియాలి. ఏయే మాటకు ఎంత నాదాన్ని పూరించాలో తెలియాలి. ఈ రహస్యం తెలియని గాయకులు రసికులను మెప్పించలేరు. గాయకులుగా స్థిరపడలేరు.

చెవికి వినబడే సుస్వరమే మనిషిని కూర్చోబెట్టి వినేలా చేస్తుంది. సంప్రదాయవాదులు ఏమని వాదించినా, విభేదించినా, భావంతో పాడవలసిన నాద స్ఫోరకమైన మాటలను గమక భూయిష్టం చేయకుండా శాస్త్రీయ సంగీతాన్ని లలితంగా చేరువచేసి పాడిన సుతిమెత్తని సుస్వరంతో శ్రోతలకు చేరువచేసి పాడిన విద్వాంసుడు డా॥బాలమురళీకృష్ణ. తెలుగుభాష సౌందర్యం తెలిసి అక్షరదోషాలులేకుండా అనుమానముంటే అడిగి తెలుసుకునే తత్త్వమున్న సెమ్మంగుడి ఎంతో జాగ్రత్తగా ఉండేవారని పెద్దలు చెప్తారు.

విజయవాడ ఆలిండియా రేడియో బాగా బతికిన రోజుల్లో ప్రసారమైన యక్షగాన పరంపరలో 'అజామిళోపాఖ్యానం' అనే యక్షగానాన్ని సెమ్మంగుడి యే రూపొందించారు. దక్షిణాదిలో కొన్ని దశాబ్దాలపాటు మకుటం లేని మహారాజులా, సంగీతరంగంలో 'భీష్మాచార్యుడు'నే పేరును సొంతం చేసుకుని విద్వాంసులకే ఆదర్శవంతమైన వ్యక్తిగా పొందిన సత్కారాలకు, సన్మానాలకు కొదవలేదు.

1947లో చాలా చిన్న వయస్సులోనే మద్రాసు మ్యూజిక్ అకాడమీ చే 'సంగీత కళానిధి' బిరుదు అందుకున్న విద్వాంసుడు. తిరువనంతపురం మహారాజా స్వాతి తిరునాళ్ అఖండ సంగీత గౌరవాన్ని తెచ్చిన వారిలో సెమ్మంగుడి ముఖ్యుడు. విద్వాంసులు స్వాతి తిరునాళ్ కృతులను అలాగే పాడతారు (అన్నమయ్య కీర్తనల వలె ఎవరికి తోచినట్లుగా వారు కంపోజ్ చేయకుండా, చేసిన కట్టుదిట్టమైన ఏర్పాటు)

సెమ్మంగుడి కున్న శిష్యగణమంతా విద్వాంసులే. వీరిలో ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి కూడా ఉండటం విశేషం. సంప్రదాయ బాణీకి చిరునామా 'సెమ్మంగుడి' యే.

సంప్రదాయ మనే మాటకు విస్తృతమైన అర్థముంది. యిళ్ళల్లో చేసుకునే పిండివంటలు, వస్త్రాలంకరణ, ఆచార వ్యవహారాలన్నీ 'సంప్రదాయానికి' గౌరవం తెచ్చే అంశాలే. సాధారణంగా మన కుటుంబాలలో జరిగే శుభకార్య పరంపరంతా సంప్రదాయానికి భిన్నంగా జరగవు.

శుద్ధమైన సంగీతం కూడా అంతే. చక్కని రాజమార్గాన్ని వదిలేసి తనకు నచ్చిన దారిని నమ్ముకుంటే కలిగే ప్రయోజనమెంతో త్యాగరాజు తన కీర్తనలో యిమిడ్చి చెప్పకనే చెప్పాడు. కేవలం విని వదిలేస్తారే గానీ, అందులోని పరమార్థాన్ని గ్రహించరు.

# లాల్గుడి జయరామన్ గారికి స్మృత్యంజలి

– ఆలమూరు విజయభాస్కర్



(ఇది మిత్రుల కోరికపై, రెండు రోజుల క్రితం లాల్గుడి జయరామన్ గారిపై ఇంగ్లీషులో వ్రాసిన వ్యాసానికి భావానువాదం)

సంగీతాబుధిలో రసజ్ఞులకు లభించిన అనర్ఘరత్నం కీ.శే. లాల్గుడి జయరామన్ గారి 90వ జన్మదిన సందర్భంలో వారికిదే నా నివాళి.

ఈ సందర్భంలో వారికి నివాళిగా వారి శిష్యులు వ్రాసిన వ్యాసాలు చూసి ఆ స్ఫూర్తితో ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

లాల్గుడిగారు నాకు గురువు. ఆయన ఎందరో కళాకారులకు గురువు. ఎందరో ఆయన శిష్యులు గొప్ప కళాకారులుగా సంగీత ప్రపంచంలో నిలబడడం ఒక గురువుగా ఆయన యొక్క విశిష్టతను చాటి చెపుతుంది. ఒక కళాకారునిగా, ఒక సంగీత స్రష్టగా ఆయన ఎలాటి శిఖరాలధిరోహించారో వివరించడానికి నా స్థాయి చాలదు. ఆయన ప్రదర్శించిన సంగీతకళ రసికుల, శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతుందని నిస్సందేహంగా చెప్పగలను.

లాల్గుడిగారికి నాకు ఒక ప్రత్యేకమైన గురుశిష్యసంబంధం ఉంది. నేను ఆయన వద్ద సంగీతం నేర్చుకోలేదు. నేను ఎప్పుడు ఆయనకచేరీలకు వెళ్లలేదు. కనీసం ఆయనను నేను చూడను కూడా లేదు. అయితే మరి ఆయన గురుత్వం ఎలా నెరపారు? అది ఒక విచిత్రమైన కథ. దీనిని మీ అందరితో పంచుకుంటాను.

నేను సంగీతసాహిత్యాభినివేశం ఉన్న కుటుంబంలో పుట్టాను. మా తాతగారు కాళిదాసు 'రఘువంశము'ను తెలుగులో ఒక కావ్యరూపంలో భావానువాదం చేసిన కవి. మా తండ్రిగారు సంగీత సాహిత్యాలలో మంచి అభిరుచికల విశ్లేషకులు. ఆయన అభిరుచి నా సోదరిని ఒక గొప్ప సంగీత విద్వాంసురాలుగా చేయడంలో తోడ్పడింది. నేను ఆయన వద్దనుండి సంగీతపిపాసను వారసత్వంగా పొందాను. 1978–83 మధ్య కాలంలో సంగీత కచేరీలు వినడం ద్వారా సంగీత ప్రియుణ్ణయ్యాను. వృత్తిపరంగా 25 సంవత్సరాలు మహారాష్ట్రలో నివసించడంవలన, కేవలం క్యాసెట్లు, సీడీల ద్వారా మాత్రమే సంగీతంతో అనుబంధాన్ని నిలుపుకున్నాను. ఆ సమయంలో మొట్ట మొదటిసారిగా లాల్గుడిగారి వలజి వర్ణం విన్నాను. వర్ణాలు ఇంత అందంగా రచించవచ్చునీ, వాయించవచ్చని నాకు అప్పుడే తెలిసింది. అప్పటినుండీ లాల్గుడి గారికి నామనస్సులో ఒక ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది. 2008 లో హైదరాబాదుకు వచ్చాక సంగీతవాతావరణంలో తిరిగి ప్రవేశించాను.

కాని దురదృష్టవశాస్తూ, కొద్ది వ్యవధిలోనే మా తండ్రిగారు స్వర్గస్థులయ్యారు. ఆ విచారాన్ని దూరం చేసుకోవడానికి ఆ సమయంలో ఎక్కువగా సంగీతం, ప్రత్యేకించి లాల్గుడి గారి సంగీతం విన్నాను. అప్పుడు ఒక విచిత్రం జరిగింది. అంతవరకూ నేను సంగీతం విని ఆనందించానే కాని ఎన్నడూ దుఃఖించలేదు. కాని ఆ సమయంలో సంగీతం, విశేషించి లాల్గుడి గారు వాయించిన త్యాగరాజ కృతులు 'ఏటి యోచనలు' మరియు 'ఓరచూపు' విన్నప్పుడు విపరీతంగా దుఃఖం వచ్చేది. ధారాపాతంగా కన్నీళ్ళు వచ్చేవి. నాకు ఈ దుఃఖం కూడా ఎంతో హాయిగా అనిపించడం చాలా ఆశ్చర్యంగా ఉండేది. మా తండ్రిగారు ఎమ్.డి. రామనాథన్ గారి సంగీతం విని ఇలా దుఃఖించేవారు. అప్పట్లో అది చూసినప్పుడు నాకు విచిత్రంగా ఉండేది. ఇప్పుడు అలాగే నాకు దుఃఖం వస్తుంటే, హ్యారీపోట్టర్ కథలో లాగా, ఆయన ఆత్మలో చిన్న ముక్క నా ఆత్మకు తగులుకుని ఉండిపోయిందేమోనని అనిపిస్తుంటుంది నాకు.

ఆ సమయంలో నాకు మొట్ట మొదటిసారి ఈ దుఃఖం ఎందువలన వస్తుందో తెలుసుకోవాలనిపించింది. అప్పుడు 'సంగీతము – రసానుభవము' అనే అంశంపై ఒక శ్రోతగా పరిశోధించాలని కోరిక కలిగింది. ఎక్కడ మొదలు పెట్టాలో, ఎలా మొదలు పెట్టాలో కూడా తెలియదు. అయితే నా మీద నాకు ఎంతో నమ్మకం ఉండేది. నాకు మంచి

తెలివితేటలున్నాయి. ఏ శాస్త్రానికి సంబంధించినదైనా పుస్తకాన్నైనా చదివితే అర్ధం చేసుకోలనన్న విశ్వాసం ఉండేది. తెలుగులో వ్యాఖ్యానసహితంగా వున్న భరతుడి 'నాట్యశాస్త్రము' పుస్తకము కొని చదవడం మొదలుపెట్టాను. కాని అందులో నున్న 'భావము' 'విభావము', అను భావము, స్థాయీభావము, సంచారీభావము, భావ శబలత వంటి పదాలు అర్ధం కాలేదు. పైగా పుస్తకంలో చూపించిన ఉదాహరణలన్నీ వేల సంవత్సరాల క్రిందటివి. ఇంక ఎలా ముందుకు వెళ్ళాలో తెలియలేదు. ఈ సంఘటన నాలోని అహంభావాన్ని దెబ్బతీసి, నన్ను మళ్ళీ విద్యార్థిగా మార్చింది. కానీ ఎవరు నాకు ఈ విషయాలు బోధించగలరో తెలియదు. అప్పుడేమి చెయ్యాలి?



ప్రతీరోజు పైన చెప్పిన రెండు కృతులని 10-15 సార్లు వినేవాడిని. ఓరచూపు కృతి నెరవల్‌లో, ఏటి యోచనలు కృతి స్వరప్రస్తారములో ఏవో రకరకాల త్యాగరాజభావాలు అస్పష్టంగా కనబడుతుండేవి. పంతంగా రోజూ ఏ పని చేస్తున్నా అవే వింటుండేవాడిని. ఇదే తపస్సేమో నాకు తెలియదు. ఇలా 3-4 సంవత్సరాలు గడిచాయి. అప్పుడు ఒకరోజు ఓ అద్భుతం జరిగింది.

రోజూలాగే, ఓరచూపు కృతిని మననం చేసుకుంటూ పడుకున్నాను. చాలాసేపైందీ కానీ నిద్రపట్టడంలేదు. అలా అర్ధరాత్రి గడిచాక కలయో మెలకువో తెలియని స్థితిలో నున్న నాకు అనూహ్యంగా లాల్గుడిగారు కనిపించారు. (అప్పటికి ఆయన స్వర్గస్థులై కొంతకాలం గడిచింది కూడా) ఆ కలలో ఆయన నాకు ఓరచూపు కృతిలో చరణంలో 'దీనరక్షకా' దగ్గర నెరవు చేసి చూపించారు. ఒకసారి దీనరక్షకా అన్నప్పుడు స్థాయీభావమైన త్యాగరాజస్వామి యొక్క దీనత్వాన్ని, ఇంకొకసారి దీనరక్షకా అన్నప్పుడు సంచారీభావములైన ఆయన యొక్క వేడుకోలు, కోపము, ఉక్రోషము, ఆఖరుగా మొఱపెట్టడం నన్ను దర్శింపచేస్తూ అనేకసార్లు అద్భుతంగా నెరవు చేసారు.

ఆ రాత్రి లాల్గుడిగారు ఒక గురువై 'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః' అన్న భరతుని సూత్రాన్ని నాకు సోదాహరణంగా వివరించారు. అప్పటినుండి నా రసప్రస్థానం ప్రారంభమయింది. అంతేకాదు, త్యాగరాజకృతులలో ఆయన యొక్క హృదయభావం దర్శించడానికి కావలసిన సాధనసంపత్తి. శక్తి క్రమక్రమంగా నా హృదయంలో చేరసాగాయి. అప్పటి నుండీ నన్ను నేను లాల్గుడి గారి శిష్యునిగా భావిస్తాను. అంతేకాదు, ఎన్నో కృతులలోని త్యాగరాజహృదయభావాలను, లాల్గుడిగారి వాదనంలో తెలుసుకునే అదృష్టం నాకు దక్కింది.

నేటి సంగీత ప్రపంచంలో ప్రతీవారినీ కళాకారులనడం సాధారణమైపోయింది. కానీ నేను ఈ క్రింది విధంగా భావిస్తాను.

-సంగీతశాస్త్రం తెలిసి బాగా పాడేవారిని విద్వాంసులు అంటారు. వీరి గానం మన బుద్ధిని రంజింపచేస్తుంది. కళాకారుల పాట మన హదయాన్ని తాకి మనసు ఏడిపిస్తుంది. సాధారణ స్థాయి కళాకారుల పాట కొన్నిసార్లు విన్నప్పుడు చాలా బాగున్నా, ఎక్కువసార్లు విన్నప్పుడు ఆ రంజకత్వాన్ని కోల్పోతుంది. -ఉత్తమ స్థాయి కళాకారుల సంగీతం అలాకాదు. జీవితమంతా ఎన్నిసార్లు విన్నా, ఒకే విధంగా నిత్యమైన, నిరవధికమైన ఆనందాన్ని కలుగచేస్తుంది.

అటువంటి కళాకారులలో లాల్గుడిగారిని నేను ఒక శిఖరంగా భావిస్తాను....

ఆయనబోధించిన విషయాలు నాకు చిరస్మరణీయములు. అందుకు నేను వారికి జీవితాంతం ఋణపడిఉంటాను. వారికి హృదయపూర్వకంగా నమస్కరిస్తూ...

సుధాతరంగం-26

# ప్రజ్ఞావంతులు శ్రీ మోహనకృష్ణ

- మోదుమూడి సుధాకర్



"గురువుగారి అడుగుజాడలలో నడవటం" అనేది అందరికీ సాధ్యపడే విషయం కాదు. అయితే సంగీత రంగంలో, గురువుగారిని అనుకరిస్తూ అనుసరించటం, వారి బహుముఖ ప్రజ్ఞను సైతం పుణికి పుచ్చుకోవటం సాధ్యమైన వ్యక్తిగా దేవరకొండ వేంకట మోహనకృష్ణగారిని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఆయనకు తన గురువు మంగళంపల్లి బాలమురళీకృష్ణగారే దైవం. ఆయన పాటే ప్రాణం. ఆయన తలపే మురిపెం. మోహనకృష్ణగారిది సంగీత వంశం. తాతగారు ప్రఖ్యాత రంగస్థల నటులు డి.వి. సుబ్బారావుగారు. మచిలీ పట్నం స్వస్థలం. చిన్నతనం లోనే సంగీతంపై ఎంతో మక్కువ ఉండేది. అప్పుడే ఆయనకు 'విద్వాన్ శిష్టు ప్రభాకర కృష్ణమూర్తి శాస్త్రిగారి వద్ద ఘనమైన పునాది పడింది. దురదృష్టవశాత్తు డిగ్రీ పరీక్షలు వ్రాస్తున్న సమయంలో ఒక్కసారిగా అంధత్వం ప్రాప్తించి, తీవ్ర మనోవేదనను ఎదుర్కొన్నారు. అయినా ఏనాడూ తన లక్ష్యసాధనలో వెనుకడుగు వేయలేదు. తన ఆరాధ్యదైవమైన బాలమురళీకృష్ణగారి వద్ద సంగీతం నేర్చుకొనే అరుదైన అవకాశం, అడిగినంతనే మురళిగారే స్వయంగా ఇచ్చారు. మద్రాసులో గురువుగారి ఇంట ఒక గదిలో అమ్మమ్మగారితో ఉంటూ, గురువుగారికి సేవ చేస్తూ, వారికి వీలై, చెప్పినప్పుడల్లా పాఠం నేర్చుకొనేవారు మోహనకృష్ణగారు.



మురళీకృష్ణగారి సంగీతాన్ని వారి అమ్మమ్మగారు పెంచి, పెద్దచేశారు. మనుమణ్ని ఆవిడ అనుక్షణం వెంట ఉండి, నడిపించారు. మోహనకృష్ణగారికి తను రచించిన 72 మేళకర్త కీర్తనాదులేకాక, వందలాది ఇతర వాగ్గేయకార రచనలు నేర్పించారు మురళీగారు. గురువుగారి నోటినుండి వచ్చిన ఏ పాటైనా మోహనకృష్ణగారికి కంఠోపాఠమే! ఏ గమకమైనా కరతలామలకమే! ఎన్నో కచేరీలలో గురువుగారితో సహగానం చేశారాయన. గురువుగారి వలెనే లలిత, సినీ గీతాలు పాడి శ్రోతలను మెప్పించారు. దేశ, విదేశాలలో వేలాది కచేరీలు నిర్వహించారు. అసంఖ్యాక సంగీత రచనలుచేశారు. బాణీలు కట్టారు. శతాధికంగా ఆడియో సిడీలను సంగీత ప్రపంచానికి అందించారు. గురువుగారి వలెనే బెజవాడ రేడియోలో ప్రవేశించారు. ఆయనతో కలిసి, నేను పనిచేయటం చేత నేను స్వరపరచిన గీతాలు ఆయన పాడటం, ఆయన బాణీలను నేను పాడటం కూడా జరిగింది. మా ఇరువురి మైత్రి ఎంతో బలమైనది..

ప్రస్తుతం ఆయన హైద్రాబాద్ కేంద్రంలో టాప్ గ్రేడ్ నిలయ విద్వాంసునిగా పనిచేస్తున్నారు. విద్యార్థులై వచ్చిన ప్రతివారికీ విద్య బోధిస్తున్నారు.

గురువుగారి సంస్మరణోత్సవాలు ఘనంగా నిర్వహి స్తున్నారు. ఇటీవల వినాయకచవితి పండగను అంతర్జాలంలో తన గానార్చనతో శోభాయమానం చేశారాయన! పండుగరోజు ప్రారంభించి, నవరాత్రులలో రోజుకు అయిదు చొప్పున మొత్తం 45 విఘ్నేశస్తుతులను గానం చేశారు. మొదటిరోజు సద్గురు త్యాగరాజస్వామి రచించిన సౌరాష్ట్రరాగ కృతి 'శ్రీ గణపతిని సేవింపరారే' తో ఆరంభించి, ముత్తుస్వామి దీక్షితులు (గణనాయకం), మైసూర్ వాసుదేవాచారి (లంబోదర మవలంబే), రామచంద్రన్ (శ్రీమహాగణపతే), మురళీగారి 'సిద్ధివినాయకేన' కృతులను గానం చేశారు.

రెండవరోజు తమ గురువుగారి ఖరహరప్రియ పదవర్ణం 'నిన్నే నెరనమ్మితి' తో మొదలుపెట్టి, త్యాగయ్య (గిరిరాజసుతా), దీక్షితర్ (పంచమాతంగ), స్వాతి తిరునాళ్ (పరిపాహి గణాధిప), ముత్తయ్య భాగవతార్ (సిద్ధివినాయకం) కృతులను పాడారు.

మూడవరోజు తమ గురువుగారి రచనలు ‘వారణవదనం‘సిద్ధిందేహిమే’ఉమాసుతం, ‘మహనీయ! నమస్సులివే, గణపతి రాగంలోని ‘గంగణపతిం’ కృతులను గానం చేశారు.

నాల్గవరోజు, దీక్షితులవారి సమిష్టి చరణాలుగల లఘుకృతులను అయిదు తీసుకొన్నారు. అవి : ‘మహా గణపతే’, ‘వల్లభ నాయకస్య’, ‘గజాననయుతం’, ‘గణరాజేన రక్షితోహం’, ‘గణేశకుమార’.

అయిదవరోజు కేవలం హంసధ్వనిరాగ కృతులు ‘వరవల్లభ రమణం’, ‘వందేనిశమహం’, పాహిప్రభో వినాయకా! నిను, ‘గం గణపతే” తీసుకున్నారు.


ఆరవరోజు ఘనరాగాలైన నాట, గౌళ, ఆరభి, శ్రీ, వరాళిరాగాలలో వివిధ వాగ్గేయకార రచనలు‘శ్రీమహా గణపతే’, ‘ప్రణమామ్యహం’, ‘మహాదేవ సుతం’,‘లంబోదరాయ’ , ‘శ్రీ మూలాధారచక్ర వినాయక’కృతులను సమర్పించారు.

ఏడవరోజు ‘శ్రీ గణనాథం’ (కనకాంగి), ‘శ్రీ మహాగణపతిం ’ (అఠాణ), శ్రీ మహాగణపతి (గౌళ), సిద్ధివినాయకం (చామరం), శ్రీ గణనాథం (ఈశమనోహరి) కృతులను పాడారు . ఎనిమిదవరోజు వాతాపి, యోగ, శ్వేత, ఉచ్చిష్ట, రక్తగణపతులపై కృతులను మాలికగా అందించారు.

తొమ్మిదవరోజు మురళీగారు రాగమాలికగా స్వరపరచిన పురందరదాసు కీర్తన ‘శరణు సిద్ధివినాయకా’ తో ఆరంభించి, మోహనకల్యాణి రాగంలో స్వీయరచన ‘కరుణించి సుముఖ!’, ‘పిరైయనియుమ్’అనే మురళీగారి తమిళ కృతిని పాడి, చివరిగా తాను రచించిన ‘హారతులీయరే’, ‘హీరగణపతికి’ అనే మంగళ కృతులతో 45 వినాయక భక్తి గీత సుమాలను విఘ్నపతి పాదాలకు సమర్పించారు మోహనకృష్ణగారు.

మామూలుగా పుస్తకం చూసి, ఇన్ని కృతులు పాడటమే ఎంతో కష్టం. అలాంటిది... చూపు ఇబ్బంది వున్నా, ధారణ చేసి, అనర్గళంగా ఇన్నీ పాడగలిగారంటే, ఆయన భక్తిని, దీక్షను అభినందించి తీరవలసిందే.

అందుకే తన శిష్యుడు మోహనకృష్ణ అంటే మురళీగారికి ఎంత వాత్సల్యం అంటే, ఒక సందర్భంలో, ‘ నాకళ్ళు పనికివస్తే, అతనికి నేత్రదానం చేయడానికి నేను సిద్ధం’ అన్నారట! అంతటి గురుకటాక్షం ఉంది కనుకనే మోహనకృష్ణ గారిని ‘కళారత్న’, ‘సునాద సుధానిధి’ ఇత్యాది బిరుదులు ఎన్నో వరించాయి. ఈనాటి యువతకు ఆయన స్ఫూర్తిదాత.



# కృష్ణమాచార్య ధిషణాహేల

– ఆచార్య కొమాండూరి శేషాద్రి

**జయన్తితే సుకృతినో రస సిద్ధా కవీశ్వరాః**
**నాస్తితేషాం యశఃకాయే జరామరణజం భయమ్**

అన్న కాళిదాసోక్తికి మహనీయులైన ఆచార్య సార్ధకనామియనుట సమంజసము. సంప్రదాయ వైష్ణవ కుటుంబీకులై ప్రభవించి వంశానుగత గీర్వాణాంధ్ర ద్రావిడ భాషాభూషణులై కవితార్కిక సింహులై సంప్రదాయ వరిష్ఠులై ధీమంతులై, సంగీత సాహిత్య కళానిధియై పెక్కురు అంతేవాసుల దక్షుల కావించిరి.

దేశిక శ్రీమంతులైన వరిష్ఠ జనకునికడ, అటు మేనమామల దరి సంప్రదాయ శాస్త్రీయ విద్య, కౌటుంబిక సంగీతము పుక్కిట బట్టి అటుపై విజయవాడ చేరి 'గాయకసార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి గురుకుల అంతేవాసియై అనతికాలంలోనే గాన వాద్య కళాప్రపూర్ణులుగా పేరొందిన యశోధనులు. నాటి విజయవాడ ఆకాశవాణి నిలయ కళాకారునిగా దాదాపు ముప్పదేడేండ్లు గాన వాద్య పారిషదులకు వయొలిన్ సహకారమిచ్చి అత్యుత్తమ శైలీ వాద్యవరిష్ఠునిగా పేరొందిరి.



ఆంధ్రదేశాన మేటి గీతార్థవైభవముతోడ అపార సాహిత్య ప్రతిభతో, బహు అష్టావధానముల మేటిగ నిర్వహించిన ధీవరులుగ లబ్ధి నొంది 'భళిరా' యనిపించుకొన్నారు. సంగీత సాహిత్యముల మేల్కలయిక ప్రస్తుతికొన్న కవిగాయక శేఖరులగుచు మన్ననపొందిన ముఖ్యులైన పండితులు పెక్కు రుందురేమో గానీ గాన విమర్శక భాగధేయులు విరళమే కదా?

నాడు ఆచార్యులు వారి సాన్నిధ్యమన్న మాబోంట్లకు కడుపు నిండెడిది. అడుగకనే విందొసగెడిది. వృత్తి, ప్రవృత్తి సంగీత సాహిత్య ఉపాసకులైన మాకు పెక్కు గీతార్థములు సుసంగత మయ్యెడివి. జతగా అన్న ప్రాప్తి కల్గెడిది. ఆరీతి వారిని సేవించుట భాగ్యారూఢ జనితమైనది.

ఆకాశవాణి, విజయవాడ కేంద్రానికి వారి సేవ ఎన్నో తెఱగుల ఉపలబ్ధమై వివిధ సంస్కృత కథాగాన, ప్రసంగ నాటకాలు చేయూత ఆవశ్యకమైన తోడునీడ, శబలతతో నిర్నిరంతరంగా నిలిచినది. అట్టి సేవనల్పిన సేవారతులాయన, వారి రచనలు సంఖ్యాబలమున లఘువైననూ పాండిత్యబలమున బృహత్తరములే, శతథా శిరోధార్యములే!

**త్యాగరాజు గేయార్థ కుంచిక:**

సుమారు ఆరువందల ఏబదికి పైగా త్యాగయ్యవారి కృతుల అర్థము నెరపుచూ పరిష్కారదిశగా ఎడనెడ పూర్వగ్రంథోక్తములలో వలసిన తావుల అభిప్రాయ అర్థవిశేషముల ఖండన చేయుటలో వెనకంజ వేయని ధీమంతులై తమ తర్కపు తీరు బాగ తెలిపి పఠితల తలలూపించుట అతి సహజమైనదాయె. ఆ పరిష్కారమైనదే బాగుబాగయ్యెడిది. జాన్‌రస్కిన్ మహాశయుడు వ్రాక్కుచ్చిన తీన అయ్యవారి రచనలు 'సార్వకాలికములు' అను తీర్మానము నెనరుగ ఈ గ్రంథము పాటిగ సాటిగ నిలచుననుట అతిశయ సుందరము. త్యాగయ్యకు నామసౌఖ్యానుభవమే ముఖ్యమని పలుకీర్తనల నొక్కి చెప్పినదియే రూఢి.

**స్వరరాగసుధ (వ్యాస సంకలనం)**

వైశేషిక వైషయిక విమర్శతోడి వైశారద్య పండిత వర్గమును అత్యయిక అందలమెక్కించినది. త్యాగయ్యవారి హృదయము నెరిగి పలుతావుల తెల్పిన కీర్తన వివరణకు శోతృ హృదయము ద్రవించుట తథ్యము. 'అనుపమగుణాంబుధీ', 'స్వరరాగసుధ', 'చక్కని రాజమార్గము' కృతులకు వారి వ్యాస కళామయ వచన సంకలనం భావకల్పద్రుమమే.... వైశేషిక వైషయిక విమర్శతోడి వైశారద్యం పండిత వర్గము అత్యయిక అందలమెక్కించినది. త్యాగయ్యవారి హృదయము నెరిగి పలుతావుల కీర్తన వివరణతీరు పఠిత హృదయము ద్రవీ భూతము చేయును. అనుపగుణాంబుధి, చేతులార, మన సంగీత సంపద, సంగీతము – ఆధ్యాత్మిక వికాసము, 'ఓంకార వివరణము సిద్ధాంతము', కచేరి అనుభవం, 'త్యాగరాజు రచనలు కీర్తనలా? కృతులా? 'వంటిచర్చాగత వ్యాససంపుటి గీతవాద్య కోవిదులకు సాహిత్య పారిషదుల మెదడుకు స్ఫూర్తి. విద్యార్థుల మెదడు మేతయనవలె.

**ప్రసంగ రసరాట్ :**

అలవోకగా వేదికముందే సద్యస్ఫూర్తితో కథలల్లి, మెప్పించిన ఘనమూర్తి. పలు తెలుగు, సంస్కృత హరి కథలను సమస్యపాలనతో క్లుప్త సుందరంగా రచించి వచించిరి. సర్వారాయ హరికథా పాఠశాలకు కథలు రచించి ప్రాసాక్షరయతి అలంకారయుక్తంగా కల్పన చేసి ఛాత్రులచే రాష్ట్రేతరంగా చెప్పించిరి. సంగీతము, ఆధ్యాత్మికత, భక్తిని త్రికముగా మలచి ఓంకార వివరణముపైన వారిది సిద్ధాంతభావము నిత్యాను సంధానము. గీతవాద్య విదులలో కృతి సాహిత్య మౌల్యము కొలది తక్కువ సహజము. ఆదృష్టితో అమలున వున్న కొన్ని కృతులలో భాషాగత గానక్రమ దోషాలను పరిష్కరించి శుద్ధ పాఠాలను అందించి పుణ్యము మూట గట్టుకున్నారు. 'బ్రోవభారమా', 'శ్రీ మహాగణపతిరవతుమాం', 'సీతమ్మ మాయమ్మ' మున్నగు కృతుల గాన సరళిని అమృతోపమయంగా దిద్ది తీర్చినారు. వారే నా గురుమూర్తులలో ఒకరైనను సుగ్రాహిగా నిలిపిరని కృతజ్ఞతతో నివేదింతును.

**గీత తాంత్రిక శిరోమణి :**

ఆయన ఒక శబ్దశిల్పి. నిర్దేశిత చిత్రము మొదట గీయును, పిమ్మట ఆరామముగా హంగులొనర్చు త్రిభావుకత ప్రవేశించి రూప సంగ్రహము చేరగా చూపరులకు రమణీయమగును. ఇట్టి నాదప్రవాహ శాబ్దికమే కృతిశిల్పమై ఆచార్యునికడ రమణీయమై మానితమైనది. అనుభవైకవేద్య సుందరము.

నైగమ షట్శాస్త్ర పురాణాగమార్థ సహితమట.
భాగవతోత్తములు కూడి పాడే కీర్తనములట
యోగివరులానందమున నొందే సన్మార్గమట
విశేషభావ త్రిపుటి.

త్యాగరాజు ధ్వనింప చేసిన తీరున వీరి రచనా వ్యాసంగము, కీర్తనాగంధము, యోచనా పరీమళము రసానందముగ సార్వకాలికమై మేలైన సంగీతకోటి ఆశయసిద్ధికి ప్రోద్బలకముగా సర్వమానితమై వరలుగాక....

**గీత వాద్య కోవిద సమూహ దాసః**
**– ఆచార్య కొమాండూరి శేషాద్రి.**



**సంగీత విదుషి**
**శ్రీమతి ఎమ్.వి. రత్నమాల, కాకినాడలో**
**ది. 22-8-2020 న మరణించారు.**
**గానకళ వారికి నివాళులు అందచేస్తున్నది.**

# ఫిడేలు - నాయుడు

- ఎస్. సల్మా, సెల్ : 98496 38367

సంగీత వాద్యములలో వైలిన్ ఒక అందమైన తంత్రి వాద్యము. దాదాపు 300 సంవత్సరములకు పూర్వము పాశ్చాత్య దేశంలో పునరుద్ధరింపబడినది. వైలిన్ వాద్యము మొదట వెస్టర్న్ సంగీతమునకు సంబంధించి ఉండేది. వైలిన్ పిడి వాద్యము అని కూడా అంటారు. వైలిన్ కమాను వేసి వాయించు వాద్యము.

మొట్టమొదట వైలిన్ వాద్యమును భారతదేశానికి బ్రిటీష్ వారు పరిచయం చేసారు. భారతదేశములో శాస్త్రీయ కర్ణాటక సంగీతాన్ని శ్రీ బాల దీక్షితులుగారు వైలిన్‌పై వాయించినారు. వీరు త్రిమూర్తులలోని శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారికి సాక్షాత్తూ తమ్ముడు.

వైలిన్ పాశ్యాత్య వాద్యము అయినప్పటికీ, భారతదేశానికి వలసరావడంతో వైలిన్ ట్యూనింగ్ చేయుడంలోను, పలికించే విధానములోను మార్పులు చెంది, స్వరాలు, రాగాలను, గమకాలను, శృతులను, జారుడు వంటి విన్యాసాలను పలికించడంలో పాశ్చాత్య సంగీతానికి భిన్నంగా వుంటుంది.

శ్రీబాలస్వామిదీక్షితర్ తర్వాత వడివేలు, తిరుక్కోడికావల్ క్రిష్ణయ్య, టి.సుందరేశ్వర్ అయ్యర్, లాల్‌గుడి రామయ్యర్, పరూర్ సుందరరామయ్యర్ వంటి ఎందరో గొప్ప గొప్ప విద్వాంసులు వారికంటూ ఒక బాణి లేదా స్కూల్‌ని ఏర్పరుచుకున్నారు. సంగీత విద్వాంసులు వైలిన్ పై ప్రతిభను చాటించుటలో వారికంటూ ఒక ప్రత్యేకమైన యూనిక్ స్టైల్‌ను మరియు రకరకాల పద్ధతులలో వారి విద్యను ప్రదర్శించేవారు.




భారతదేశములో వైలిన్ హిందూస్తానీ, కర్ణాటక, నాట్య, భజనలలో ప్రక్క వాద్యముగాను, మరియు మృదంగంతో బాటు సహకార వాద్యముగా వుండేది. సంగీత కచేరిలయందు ప్రక్క వాద్యమునకు పరిమితం అయిన వైలిన్ భారతదేశమునందు వైలిన్ సోలో కచేరీలను ప్రారంభించిన వారు పద్మశ్రీ, కళాప్రపూర్ణ డా॥ద్వారం వెంకటస్వామి నాయుడు గారు.

నాయుడుగారు 1893 నవంబరు 8వ తేదీన దీపావళి పండుగ రోజున బెంగుళూరులో జన్మించారు. నాయుడుగారు తనదైన బాణితో ఎంతో మధురంగా, స్పష్టంగా వైలిన్ పలికించి అందరి మన్ననలను పొందారు. వీరి వైలిన్ వాద్యము ఎప్పటికప్పుడు ఆధునికతతో, పరిశోధనాత్మకంగా ఉండేది. 20వ శతాబ్దంలో నాయుడుగారి సోలో కచేరిలు భారతదేశమంతటా మారు మ్రోగిపోయాయి.

భారతదేశంలో ఎందరో వైలిన్ విద్వాంసులు మరియు నాయుడుగారికి సమకాలికులు ఉన్నప్పటికి నాయుడుగారి వైలిన్ వాద్యము మాత్రం భిన్నంగా ఉండేది.

నాయుడు గారి కాలంలో సోలో కచేరీలు చేసిన ఇద్దరు ప్రసిద్ధ కళాకారులు శ్రీ తిరుక్కోడికావల్ కృష్ణయ్యర్, శ్రీ గోవిందస్వామి పిళ్ళై, నాయుడు గారికి సమకాలికులు శ్రీయుతులు హరినాగభూషణం, మైసూరు చౌడయ్య గారు, శ్రీ కుంభకోణం రాజమాణియ్యం పిళ్ళైగారు

వీరందరు నాయుడుగారి విద్యా నైపుణ్యాన్ని ప్రశంసించేవారు.

నాయుడుగారు ఏక సంథాగ్రాహి కావడం వలన కఠోరసాధనతో నాదోపాసన ద్వారా సంగీతాన్ని జయించారు. నాయుడుగారిని "ఫిడేలు నాయుడు" అని కూడా ముద్దుగా పిలుచుకుంటారు. నాయుడుగారు తన నిత్యజీవితంలో ఎంతో క్రమ శిక్షణతో ఉండేవారు. పెద్దలంటే వినయం, భక్తి ఉండేవి.

నాయుడుగారు విద్యార్థులతో కచేరి చేయాలంటే ఏకాగ్రత, ధైర్యముతో పాటు సాధన వుండాలని చెప్పేవారు. ఇంకను, సంగీత సాధన ఒకరోజు చేయకపోతే మనలోని తప్పులు తెలుస్తాయి. అదే రెండు రోజులు సాధన చేయకుండా మానేస్తే మన సంగీతం వినే శ్రోతలకు మన తప్పులు బాగా తెలుస్తాయి అనేవారు.

నాయుడుగారు వైలిన్ పై 30 సెకన్లు పాటు కమానును ఉంచి నాదం వినిపించేవారు. వైలిన్ ను హార్మోనిక్‌గాను, మెలోడిక్ గాను వాయించేవారు. అంతేకాదు, కర్ణాటక సంగీతంలో పాటు హిందూస్తానీ సంగీతమును, పాశ్చాత్య సంగీతమును కూడా వాయించుటకు ఇష్టపడేవారు.

వెస్టర్న్ నొటేషన్‌ను, బ్యాండును మరియు వెస్టర్న్ టెక్నిక్స్‌ను తెలుసుకుని పలికించేవారు.

ప్రతిరోజు కనీసం ఒక అరగంటసేపు అయిన కమాను లేకుండా వైలిన్‌పై చేతి వేళ్ళతో మీటుతూ సాధన చేసేవారు.

నాయుడుగారు వైలిన్ సాధనచేయు సమయంలో ఒక్కసారిగా వైలిన్‌ను తన వెనుకకు త్రిప్పి వాయించేవారు. సహజంగా వైలిన్ వాయించినపుడు ఎలా వినిపించేదో అంతే స్పష్టంగా, మధురంగా వైలిన్‌ను పలికించేవారు.

నాయుడుగారు తన వైలిన్‌పై వర్ణాలను మంద్ర, మధ్య తారాస్థాయిలలో త్రికాల సాధన చేసేవారు. ఒక తీగపై అటతాళవర్ణమును పూర్తిగ వాయించేవారు. రోజు సాయంకాలం 6.30 గంటల నుండి దాదాపు 3 గంటల సేపు కచేరి పద్ధతిలో సాధన చేసేవారు.

విదేశీయులు నాయుడు గారిని "వైలిన్ విజర్డ్" అని పిలిచేవారు. వైలిన్ విజర్డ్ అనగా "ఫిడేలు మాంత్రికుడు" అని అర్థం.

నాయుడు గారు 1919వ సంవత్సరంలో విజయనగర సంగీతకళాశాలలో ఉపాధ్యాయులుగా దాదాపు 17 సంవత్సరములు ఉండి, 1936వ సంవత్సరములో అదే కళాశాలకు ప్రధానోపాధ్యాయులుగా నియమింపబడ్డారు.

నాయుడు గారు 1954 వ సం॥లో పదవీ విరమణ పొందారు. వీరి తరువాత వీరి పెద్ద కుమారుడు శ్రీద్వారం భావనారాయణరావు గారు 1962 నుండి 1973 వరకు ప్రధానోపాధ్యాయులుగా విధులను నిర్వర్తించేవారు. ఫిడేలు నాయుడుగారిని వరించిన అవార్డులు, సన్మానాలు, సత్కారాలు ఎన్నో కలవు. వీటితోపాటు నాయుడుగారు ఎన్నో స్వర్ణపతకములు, వజ్రపు టుంగరాలు, పౌరసన్మానాలు, మహారాజుల వారి చేతులమీదుగా సువర్ణ రాజ ముద్రికలు, దుశ్శాలువలు, పచ్చలు కెంపులతో పొదిగిన మైసూరు రాజ్య చిహ్న స్థగిత స్వర్ణహారములు, స్వర్ణఘంటా కంకణములు మరియు రజితపేటికలో రూ. 35,000 నిధిని బహుమానంగా పొందారు.

1993 వ సంవత్సరం భారత ప్రభుత్వం, నాయుడుగారి పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.

నాయుడుగారికి గల బిరుదులు పద్మశ్రీ, సంగీత రత్నాకర, కళాప్రపూర్ణ, గానకళావిశారద, గాంధర్వ విద్యాభూషణ, డాక్టరేట్ మరియు శ్రీ రాజాలక్ష్మి ఫౌండేషన్ బిరుదులు కలవు.

డా॥ ద్వారం వెంకటస్వామి నాయుడుగారు 25-11-1964వ సంవత్సరములో హైదరాబాదు నందు తన తుదిశ్వాసను విడిచారు.

నాయుడుగారి బాణిని ఇప్పటికి వారి కుటుంబ సభ్యులు, శిష్యులు, ప్రశిష్యులు కొనసాగిస్తూనే ఉన్నారు. భారతదేశంలో ఉన్న ప్రముఖ వైలిన్ విద్వాంసులు ద్వారం వారి బాణీని కొనసాగిస్తున్నవారే అని అనడంలో అతిశయోక్తి లేదు.

**రీసెర్చిస్కాలర్,**

**పద్మావతి మహిళాయూనివర్శిటి, తిరుపతి.**

# మనసులోని మర్మములు తెలిసిన శ్రీ త్యాగరాజు

- శ్రీమతి గుంటూరు అన్నపూర్ణ, సెల్ : 98193 30248

మనస్సు మానవ జీవితములో ఒక ప్రధాన భాగం. సర్వేంద్రియాలను శాసించేది మనస్సు. ఇంద్రియాలన్ని మనస్సు ఆధీనవే. మనస్సు యొక్క ఆజ్ఞలను అనుసరించి ఇంద్రియాలన్ని పనిచేస్తాయి. మనస్సు గూర్చి మనము ప్రతిరోజు ఏదో ఒక సందర్భములో మాట్లాడుకొంటూనే ఉంటాము.

"ఈ రోజు నా మనస్సు ఏమీ బాగాలేదు"

"వాడి మనస్సులో ఏముందో ఎవ్వరికి అర్థం కాదు."

"ఈరోజు నా మనస్సు మనస్సులో లేదండి"ఇత్యాది.

ఇలా మనస్సు మన మీద అధికారం చెలాయిస్తూనే ఉంటుంది. మనస్సును గూర్చి అనేకమంది కవులు ఆది కాలము నుండి వర్ణిస్తూనేయున్నారు. మనస్సు కవులకు ఎప్పటికప్పుడు ఒక నిత్యనూతన విషయము. సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ త్యాగరాజు తన కృతులలో అత్యధికముగా మనస్సును వర్ణించారు అన్న సంగతి పరిశీలిస్తే అర్థమవుతుంది.

సర్వేంద్రియాలను శాసించేది మనస్సు. ఆ మనస్సే బలహీనమైన ఆ మనిషి ఇంద్రియలోలుడగును. తద్వారా మనిషి పతనం ప్రారంభమవుతుంది. ఆ విషయం తేట తెల్లం చేస్తూ శ్రీ త్యాగరాజు "మలయమారుత' రాగంలో 'మనసా ఎటులోర్తునె నా మనవి చేకొనవే ఓమనసా' అంటూ వ్రాశారు. మనస్సు కల్పించు ప్రాపంచిక విషయ వాంఛలకు దాసుడై బాధపడు ఎందరినో చూచి వారిని మేలుకొల్పుటకు సులభమగు భక్తిమార్గమును మానవాళికి బోధించారు.

మనస్సు మాధ్యమముగా ఆయన "మనసా శ్రీరామ చంద్రుని మరువకే" అని 'ఈశామనోహరి' రాగంలో మనస్సును హెచ్చరిస్తూ జన్మజన్మల ఫలము మనకు కలిగిన ఈ మానవ జన్మమును శ్రీరాముని శ్రవణ, కీర్తన స్మరణాదులతో సేవించమని ఉద్బోధిస్తారు.

మరో కీర్తనలో "మనస్సు నిల్పశక్తి లేకపోతే మధుర ఘంట విరుల పూజేమి సేయును" అంటారు అభోగి రాగంలో. మనస్సు నిల్పినప్పుడే సాధనా ఫలితం మనకు అందుతుంది. ఎన్ని పూజలు చేసినా గణగణమని గంటలు మ్రోగించినా పూలు సమర్పించినా మనస్సు భగవంతునిపై నిల్పలేని ఎడల ఆ పూజలు నిర్ధరకము అని తెలియచేస్తున్నారు శ్రీ త్యాగరాజు. కొందరు తమ బాధలను బైటకు చెప్పుకోలేరు. అలా అని గుండెల్లో దాచుకోలేరు. అట్టి వారిని చూచి శ్రీ త్యాగరాజు మానసంరక్షకుడైన శ్రీరాముని సంబోధిస్తూ 'హిందోళ' రాగంలో గానం చేసిన కీర్తన "మనస్సులోని మర్మమును తెలుసుకో". శ్రీరామా నీవు దయగలవాడవు. నీ దయ నాపై ప్రసరింపచేసి నా మనస్సులోని వ్యధను పోగొట్టుమని ప్రార్థిస్తాడు.

ముందుచెప్పిన "మనసా ఎటులోర్తునె నా మనవి చే కొనవే" అన్న మలయ మారుత రాగ కీర్తనలో ఓ మనసా! నా మాట విను, సూర్యవంశమునకు అలంకారమైన ఆ శ్రీరామచంద్రుని కొలువుము. రాజస, తామస గుణములు కలవారు అసురులతో సమానులు. అట్టి వారితో చెలిమివలన ఎట్టి ప్రయోజనము గలదు. సత్వగుణ సంపన్నులైన సజ్జనులతో చెలిమివలన సులభముగ ముక్తి పొందెదవు" అని మనసుకు హితబోధ చేస్తారు.

నాటకు రంజి రాగంలో "మనస్సు విషయ నట విటుల కొసగితే మా రాముని కృప కల్గునో మనసా" మనస్సు విషయ వాంఛలకు లోబడిన భగవంతుని కృప ఎట్లు

కలుగును? కలగదు అని త్యాగరాజు ఈ కీర్తన ద్వారా మను ఉద్బోదిస్తారు.

నళిని కాంతి రాగంలో "మనవి ఆలకించరాదటే మర్మమెల్లదెల్పెదనే మనసా" అన్న కీర్తనలో కరుణాంత రంగుడైన పరమాత్మలోకమందలి జీవులనుద్ధరింపదలచి శ్రీరామచంద్రునిగ మానవావతారము ఎత్తెనని, ధర్మము కొరకు కష్టముల నిగ్రహించి సన్మార్గమును బోధించాడు. ఓ మనసా నా మనవి విని ఆ మహానుభావుని సేవించి తరించమని శ్రీ త్యాగరాజు హెచ్చరిస్తున్నాడు.

శంకరాభరణ రాగంలో "మనసు స్వాధీనమైన యా ఘనునికి మరి మంత్ర తంత్రము లేల" అన్న కీర్తనలో మనస్సు యొక్క ప్రాధాన్యతను, మనోవిగ్రహము యొక్క ఆవశ్యకతను బోధిస్తారు శ్రీ త్యాగరాజు. "చిత్త శుద్ధి లేని శివపూజ లేలరా అన్న వేమన కవి భావాలు కూడా ఇవే.

ఆందోళిక రాగంలో "రాగసుధారస పానము చేసి రంజిల్లవే మనసా''. రాగసుధారసపానము చేసి తన్మయులై తరించమని. ఈ ఆనందానుభవము యాగముల వలన కాని, యోగముల వలన కాని రాదని తెలియచేస్తున్నారు. ఓంకారము నుండి నాదము జనియించినది. అట్టి ఓంకారజన్యమైన నాదము వలన పరమేశ్వరునిలో లీనమై జీవన్ముక్తులు కావచ్చని లోకానికి చాటి చెప్పారు.

ధన్యాసిరాగంలో "సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే మనసా". సంగీత జ్ఞానము ఎంత వున్నా భక్తి భావములేని గానం వ్యర్థం. భృంగి, ఆంజనేయుడు, అగస్త్యుడు, నారదుడు మొదలగు సంగీత సాంప్రదాయ ప్రవర్తకులు ఈ భక్తి భావమునే ప్రబోధిస్తారు. భక్తిభావ మయమైన నాదోపాసనము చేసి అరిషడ్వర్గముల జయించి ఆ పరమేశ్వరునిలో లీనమై కైవల్యం చెందవచ్చని మనస్సును సంభోదిస్తూ మనందరిని చైతన్యవంతులు చేయటానికి సంగీతం సాధనగా ప్రయత్నించారు త్యాగరాజు.

జయ మనోహరి రాగంలో కర్మయోగం, జ్ఞానయోగం కూడా భక్తి లేనిచో శోభించవని తెల్పుచూ " యజ్ఞాదులు సుఖమను వారికి సములజ్ఞానులు కలరా ఓ మనసా" అంటారు.

సుజ్ఞాన దరిద్ర పరంపరుల
సురచిత్తుల జీవాత్మహింసగల ॥యజ్ఞా॥

కేవలము అసుర సంపత్తి కల్గి నిజమైన జ్ఞానయజ్ఞ, కర్మ యజ్ఞముల జ్ఞానము లేక జీవ హింస ద్వారా జరిగే యజ్ఞమే యజ్ఞమని భావన చేసేవారు – సుజ్ఞాన దరిద్రులు. ఇట్టివారు చచ్చుచు, పుట్టుచు ఐహిక భోగాసక్తులగు వారికి మనసు మాధ్యమముగా చెప్ప ప్రయత్నించారు శ్రీ త్యాగరాజస్వామి.

"నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి సేవసుఖమా! నిజముగ బల్కు మనసా" అను కళ్యాణి రాగములోని కృతిలో త్యాగరాజు మనసును పలు ప్రశ్నలీవిధముగా అడిగెను.

నిధి చాల సుఖమా! లేక రాముని సన్నిధి సేవయా! దధి, నవనీత, క్షీరము రుచియా, లేక దాశరథీ ధ్యాన, భజన సుధారసము రుచియా, మమత, బంధనములతో కూడిన నరుని స్తుతించుట సుఖమా! లేక త్యాగరాజుచే కీర్తింపబడిన శ్రీరాముని కీర్తన సుఖమా!

ఓ సుమతీ! భగవంతుని కీర్తించుటయే సుఖము అని శ్రీ త్యాగరాజు మనస్సును ప్రశ్నించుట ద్వారా తెలియజేసెను.

ఇలా ఎన్నో కీర్తనలలో మానవులను బలహీనపఱచు మనస్సును ఉద్దేశించి శ్రీ త్యాగరాజు జనావళికి తరుణోపాయము బోధించారు. ఆయన కృతులు సంగీత సాహిత్య ప్రియులకే కాదు మానవాళికే మరో భగవద్గీత.

**– రీసెర్చిస్కాలర్,**
**పద్మావతి మహిళాయూనివర్శిటి, తిరుపతి.**

# వాగ్గేయకారుల శివస్తుతి. కీర్తనలు

-సి.ఉమాదేవి, సెల్:9573374947

చాలమంది వాగ్గేయకారుల కీర్తనలు వివిధ దేవతా మూర్తుల మీద, ఇష్టదేవతా మూర్తుల మీద కొల్లలు. మనకు లభ్యమైనవి కొన్ని మాత్రమే.

భగవంతుడు శివుడు తన ఎదురుగా ఉన్నట్లు భావిస్తు వినయంగా, నిష్ఠూరంగా, కోపంగా రకరకాల భావాలు వ్యక్తికరిస్తూ, భక్తి వైరాగ్యాలు ప్రకటిస్తూ ఆత్మవంచన లోక వంచన లేని చిత్తశుద్ధితో నివేదిస్తూ చాలామంది సంగీత వాగ్గేయకారులు రచనలు అందించారు.

శివునికి ముఖ్యమైనది అభిషేకము కొంతమంది కవులు కూడా లివ్య, రచనతో ఈ విషయాన్ని విశదీకరించారు ( ఉ ॥దూర్జటికవి)

నవరసాలు వొలికినప్పుడే రాగ, భావ, తాళ విన్యాసాలు తెలుస్తాయి. సంగీతం తోనే కాక కావ్యాలలో కూడా నవరసాలుంటాయి.

భక్తి, శృంగారం, వీరం మొదలైనవి అభిషేక జలాలుగా భావించవచ్చు. కూర్చు పదమల యొక్క కలయిక పవ్వులుగా చెప్పవచ్చు. శ్రవణ సుభగమైన మధుర శబ్ద విన్యాసాలు మంగళ నినాదాలుగా, ఉపమా, రుపకాది అలంకారాలు శివునికి, అర్పించే దివ్యమైన వస్త్రాలుగా, కవితా సౌందర్యం శివునికై వెలిగించే దీపకాంతులుగా కావ్యగతమైన మాధురీ మహిమయే భగవంతుని నైవేద్యంగా భావించే వాగ్గేయకారులెందరో.

సత్యం, శివం, సందరం అయిన భగవత్ స్వరూపాన్ని వర్ణించడానికి, పోలిక చెప్పడానికి అలంకారాలు పదప్రయోగాలు, విశేషార్థాలు, చమత్కారాలు, నవరసాలు మొ॥ ఎంతోమంది ఈ ప్రయోగాలతో రచనలు చేసినా ప్రతి వాగ్గేయకారుని యొక్క మానసిక, అంతర్ మధనానికి అనుభవాలకి మధ్య జరిగే సంఘర్షణ ల ద్వారా రచనలు చేసినప్పటికి దేనికి అందని దైవస్వరూపాన్ని స్తుతించుట మనిషికి సాధ్యమా? అని స్వగతంలో అనుకుంటారుట.

ఐనా వాగ్గేయకారులు తమ శక్తికొలది కొలుచుట మానరు కదా. మనిల్లిదేవుని వర్ణించడానికి అర్హత లేదని తెలిసినా అర్హత కొరకు, దేవుని సన్నిధి కొరకు, పరితపించుట, భగవదనుభూతిని పొందుటకు నిరంతర ప్రయత్నం చేస్తాడు. భక్తి అనేది శక్తివంతమైన మార్గము, సునిశ్చితమైనది, సులభమైనది, నమ్మకమైనది అమోఘమైనది మరియు తప్పక సఫలం అగునట్టిది. ఇది భక్తుని విశ్వాసం.

"జ్ఞానీతు ఆత్మైవమేమతమ్" భక్తిలేని పరాకాష్ఠ ఆత్మనివేదనమే. అదే జీవేశ్వర అభేద స్థితి దానిని సాధించడమే సాధకుడికి పరమావధజ. ఆత్మనివేదనమే భక్తికి పరాకాష్ఠ.

'నేను' అనేదాన్ని సమర్పించడం కుదరదు. ఎందుకంటే ఇక్కడ రెండు వస్తువులు లేవు. ఇవ్వబడేది (అహం) ఆత్మ. ఇచ్చేవాడు కూడా (అహం) ఆత్మే రెండూ ఒకటే అయినపుడు ఇది కుదరదు. అందుకే సరిగ్గా అర్థం చేసుకోలేని వారు నన్ను నేను భగవంతునికి సమర్పించుకుంటున్నాని భావిస్తుంటారు.

ఆత్మ శుద్ధ చైతన్యం అది నేను. నేను అనిస్ఫురించే అఖండవమైన స్వరూపం. అది జడ వస్తువు కావు. ఆత్మ నివేదనమంటే ఆత్మ తత్త్వ జ్ఞానాన్ని పొందడమే.

ప్రాపంచిక (విషయ) వస్తువులపై కలిగిన వైరాగ్యం ద్వారా కూడ బెట్టిన శారీరక మానసిక శక్తులను ఆధ్యాత్మిక వికాసానికి ఉపయోగించినపుడే వాటికి సార్థకత కలుగుతుంది.

పవిత్రమైన మనస్సు ఆత్మ సాక్షాత్కారం కల్గిస్తుంది. అలాంటి స్థితిని పొందిన వాగ్గేయ కారులెందరో.

శివం శంకరం మందాకిని ధరం శశికళాభూషణం రవి శశి శిఖి నేత్రం నాగ కుండల ధరం సుందరం గరళ కంధరం మృగధరం భవహరం త్రిపురాంతకం సుర భూసురాది నుతం ఉమాశంకరం భావయామి సతతమ్.

మంగళప్రదమైనది శివమంత్రం.

విశ్వవ్యాపకం విష్ణు మంత్రం

శివకేశం ప్రతిపాదిత పంచాక్షర – అష్టాక్షర మంత్రాలు మోక్షప్రదమగు భవతారకం. సామ వేదసారమగు నాదోపాసన మోక్ష మార్గానికి బహు సారూప్యం. శివ – మాధవం–దేవీలను త్రిమూర్తుల కీర్తనలతో కీర్తించేరు.

రూపాలు– నామాలు అనేకమైన పరబ్రహ్మం పరాశక్తి ఒక్కడే. తారతమ్య రహితమైన పరాశక్తి శబ్ద–స్పర్శ, రూప, రస, గంధాదులకు అతీతమైన నిర్గుణ, నిరాకార, నిరంజనమగు పరబ్రహ్మ నాదోపాన ద్వారా ఉపాసించడం పూర్వ పుణ్యమే అవుతుంది.

యజుర్వేదంలో రుద్రాధ్యాయం అనే రుద్ర సూక్తమ్ కైలాస గిరిపై శయనించి వున్న శివున్ని పలుమార్లు స్తోత్రము చేస్తున్నది. ఈ భూమి మీద పర్వతమే భగవంతుని తొలి నివాసము. శివుడే ఆది గిరిజనుడు సింధు నాగరికతలో పశు పతిగా కొలవబడినది శివుడే.

త్రిమూర్తులతో ఒకరైన త్యాగయ్యగారి అపురూప శివకృతులు, కొవ్వూరు, పంచరత్న, కంచి, లాల్‌గుడి శ్రీరంగం, నాగపట్టణం మొ॥ క్షేత్రాల కీరిస్తు రచనలు చేసారు.

| కీర్తనపేరు | రాగం | తాళం | రచయిత |
|---|---|---|---|
| 1.సదాభజింపవే | తోడి | ఆది | త్యాగయ్య |
| 2.పుష్పవనవిహార్ | వసంత | మిశ్రబావు | ॥ |
| 3.శంకరుని రజత గిరీశుని | శంకరాభరణ | ఆది | ॥ |
| 4. శివపరాధముసేయరాదు | సామ | ఆది | ॥ |
| 5. క్షేత్రపాలక్షీమకారకా | బెలహరి | ఆది | ॥ |
| 6.పరబ్రహ్మమనె పతినినమ్మితిని | ఖరహరప్రియ | ఆది | ॥ |

విశ్లేషణ – ఖరగరప్రియ రాగం –22 మేలకర్త – రాగం గరగం చతుశృతి రిషభం, సాధారణ గాంధారం, శుద్ధమధ్యమా, చతుశృతి దైవతం, కైశికి నిషాదం.

ప॥ పరబ్రహ్మమనె పతిని నమ్మితిని

భవరాగ శమన ప్రణతార్తి హరుడను

అ॥ అరుణ కిరణజ కమలములతో

భ్రమరము చేసిన భక్తిరీతిలో

చ॥ తపయోగములలో తారతమ్య రహిత

శివరామ తత్వ స్మరణము తాను

బశ తారక రామ నామ రసకే

త్యాగరాజ వరద చిత్సుఖ దాయకే.

**సారాంశం :–**

ప॥ పరబ్రహ్మమనె పతిని అని త్యాగయ్య అన్నారు. 'పతి' అనే ప్రతీక వాడడంలో పరబ్రహ్మంతో చేరినప్పుడే జీవికి నిజమైన ఆనందం కల్గుతుందని అనే అర్థం యిమిడి వుంది. జగత్ పతిమైన పరమేశ్వరుడు మాత్రమే భవరోగమలను ఉపశమింప చేయగల్గిన దివ్యవైద్యుడు.

అ॥ ప్రభాత సూర్యుని అరుణ కాంతులను వికసించిన పద్మములతో 'భక్తి' అనే తుమ్మెదలు నినదించే ప్రణవ నాదమే ఈ సంగీతం.

చ॥ భక్తి యోగంలో శివుడనో, కేశవుడనో విభేదాలు లేవు. సర్వము కేవలం పరతత్త్వంగా భావించి ధ్యానించడం వల్లె భౌతిక తత్వానికి అతీతమై చిదానందము లభ్యమవుతుంది. (వినాశం లేని పారలౌకిక ఆనందం లభ్యమవుతుందని అర్థం).

తైత్తరీయోపనిషత్‌లో శిక్షావల్లి 6వ అనువాకంలో వున్న శ్లోకానికి శ్రీ జగద్గురు వేదాంత లక్ష్మణాచార్యులు.

వివరణ : – "హృదయ కమలమునందు తుది వరకు ఆకాశముంది ఈ హృదయాకాశము నందు మనోమయుండును, జ్యోతిర్మయుడును (హిరణ్మయుం) మరణ ధర్మము లేని వాడును (అమృతం) అగుపురుషుడున్నాడు. ఈ పురుషుడు పరమాత్మను పొందుటకు కారణమైన మార్గం ఒకటున్నది. రెండు దౌడల మధ్య ప్రదేశమును (తాలుకే అంతరేణ) స్తనము వలె (స్తవ ఇవ) పది ఆశ్రయించి యున్నదో, ఎచ్చుట పద్మకేశముల తడి దొర్లుచున్నదో (కేశాన్తః వివర్తతే) శిరస్సును కపాలమును విభజించి బయలు వెడలునది (శీర్షికపాలే వ్యపోహ్య) అలాంటి మార్గమే పరబ్రహ్మప్రాప్తికి కారణం సంగీత దిగ్గజాలు, అజ్ఞాత వాగ్గేయకారులు, స్వార్థం లేక వారి అనుభవించిన, "భక్తిని" సంగీత ప్రపంచానికి చాటి చెప్పారు.

# నేనెరిగిన ప్రతిభాశాలి - విజయ మామి

నిబద్ధత, అంకిత భావం, నిస్వార్ధత మూర్తీభవించిన ప్రతిభావంతురాలైన ఒక ఆదర్శ మహిళను ఇటీవలి కాలంలో కలుసుకుని సంభాషించటం నా జీవితంలో ఒక మరపురాని అనుభవం.

ఆమె పేరు, శ్రీమతి విజయరాజు (ఢిల్లీ). విజయ మామి, విజయ అంటీ అని అందరూ ఆప్యాయంగా పిలుచుకుంటారు. సెప్టెంబర్ 10, 1938 లో కోయంబత్తూరులో జన్మించిన ఆమె ప్రకృతి సాన్నిహిత్యంలో పెరిగారు. 82 సంవత్సరాల వయస్సులోనూ ఆమె ఆలోచనలు, ఆచరణ, కార్యదీక్ష, అంకితభావం నవయువతతో పోటీపడినట్లుగా ఉంటాయి.



ఆరేళ్ళ వయస్సులో ఆమె సంగీత సాధన ప్రారంభించి అందులో విశిష్టత సాధించినా, ఎప్పుడూ వేదికపై కచేరీలు చెయ్యటానికి ఆమె సుముఖత చూపలేదు. అయితే తన సంగీత విద్యను నలుగురికి పంచుతూ అందులోనే ఆనందం పొందుతుంటారు.

B.Sc ( Botony) డిగ్రీ B.A (Music) చేసిన విజయ మామి 22 ఏళ్ళ వయస్సులో వివాహం చేసుకొని, నలుగురి పిల్లలకు తల్లిగా వారిని ఎంతో బాధ్యతతో పెంచి ఆదర్శవంతులుగా, ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఆత్మ గరిమ కలిగిన మహిళ ఆమె. మనుమలతో, హాయిగా కాలం గడుపుతూ మంచి కుటుంబమే మహిళ శక్తికి బలమని నమ్మిన పరిపూర్ణమైన వ్యక్తి విజయ మామి.

హఠాత్తుగా భర్త మరణం ఆమెను కృంగతీసినా ఎంతో ఆత్మస్థైర్యంతో ఆమె నిలబడగలిగారు. భర్త మరణానంతరం ఆమె ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు.

విధి నిర్వహణలో ఉంటూనే ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి డిప్లొమా ఇన్ మ్యూజిక్ పట్టం తీసుకున్నారు. సంగీతం ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని విజయ మామి నమ్ముతారు. సంగీతమే ఊపిరిగా భావిస్తూ విద్యార్థులకు సంగీతం బోధిస్తూ, సంగీత కచేరీల నిర్వహణకు సహకరిస్తూవుంటారు. కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహించేందుకు ఆమె కొందరు సంగీత ప్రియులతో కలిసి ఢిల్లీ సరితా విహార్‌లో “నాద వినోదిని” సంస్థను ప్రారంభించటంలో కీలక పాత్ర వహించారు. ఈ సంస్థ సంగీతంలో వచ్చే ఆధునిక పోకడలు మరియు కొత్త ఆలోచనల పైన తరచూ వర్కుషాప్స్ నిర్వహిస్తూ కచేరీలతో నాదవినోదిని ఎప్పుడూ కళ కళ లాడాలని ఆమె ఆకాంక్షిస్తుంటారు.

మా తండ్రిగారు, ప్రఖ్యాత సంగీత విద్వాంసులు శ్రీ మల్లాది సూరిబాబుగారు తరచుగా ఈ సంస్థ కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటారు.

ఒక్క సంగీతమే కాదు, సాహిత్య పఠనం, రచనలు, పెయింటింగ్, పాక శాస్త్రం వంటి కళలలో కూడా ఆమెకు ఆమే సాటి.


తమిళ పత్రికలలో మామి వీటిపై వివిధ వ్యాసాలు, శీర్షికలు రాస్తూ వుంటారు. భారత ఉపఖండంలో 52 శక్తి పీఠాలపై వ్యాసం రాయాలని సంకల్పించిన విజయమామి మన దేశంలోనే కాక పాకిస్తాన్లో కూడా స్వయంగా పర్యటించి అక్కడి స్థల మహత్యంపై అవగాహన పెంచుకొని ఆవ్యాసాన్ని పూర్తి చేసారు. ఇది ఆమెలోని నిబద్ధత, సంకల్పసిద్ధికి తార్కాణం.

ఆమె అనువాద రచనలలో చెప్పుకోదగిన “మ్యూజిక్ థెరపీ”, శ్రీమతి “మది ఓలి సరస్వతి జీవిత కథ”. మది ఓలి సరస్వతి గారిని విజయ మామి తమ ఆత్మగురువుగా భావిస్తారు. మామి మణికట్టుకు శస్త్ర చికిత్స జరిగినా ఆమె తన సాధన మాత్రం వదులుకోలేదు.

ఆమెను ఒక స్వయంప్రభగానే అభివర్ణిస్తాను. ఈ వయస్సులో కూడా ఆమె తన నమ్మిన రంగంలో అదే పట్టుదల, కార్యదీక్ష, ఆసక్తి కనపరుస్తూ పలువురికి ఆదర్శంగా జీవిస్తున్నారు. తను సంతోషంగా వుంటూ, తన చుట్టూ వున్న వారికి ఆనందం పంచటం ఆమెలోని గొప్పతనం.

ఆమె ఇలాగే జీవిత కాలాన్ని ప్రశాంతంగా గడుపుతూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం గడపాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

-మల్లాది శ్రీరామ్‌ప్రసాద్



# Krishnamacharya Kala Peetham (R). Vijayawada

Regd. Address: 29-9-41/1, G.R. Naidu street,
Suryaraopet, Vijayawada - 520002

**Krishnamacharya Kala Peetham** is a renowned music organisation established in 2002 to promote the Music and Literary services of **"Vaggeyagakara" Sriman N.CH.Krishnamacharyulu.**

Every year Kalapeetham organises music and literary programmes in memory of Late Sriman Krishnamacharyulu garu. This year Kalapeetham has decided to conduct online Global Carnatic Music competitions to promote classical music as well as to propagate invaluable compositions of "Vaggeyakara" Sriman Krishnamacharyulu garu.

# Krishnamacharya Kala Peetham Online Global Music Competitions-2020

## Instructions to Applicants

### Carnatic Classical Vocal-Juniors:

- Age Limit: 6 to 15 years as on 01-11-2020.Proof should be submitted.
- List A : Candidates should enclose a list of six "Aadi" Tala Varnams and has to perform one Varnam of judge's choice in Madhyama Kaala.
- List B : Candidates should sing one Kruti of judge's choice from the four compositions of "Sangeetha Sahitya Kalanidhi" Sriman N.Ch. Krishnamacharyulu garu mentioned below :
- Andamu Aanandamu – Anandabhairavi - Aadi
- Eehi Sannidehi – Husseni - Aadi
- Ramakrishna Mahodayam – Kharaharapriya – Misra Chapu
- Venkatagiri Nayaka – Saaranga – Aadi Taalam.

### Carnatic Classical Vocal- Seniors:

- Age Limit: 16 to 30 years as on 01-11-2020. Proof should be submitted.

**Graded artists of AIR are not allowed.

List A - Candidates should enclose a list of six krutis of renowned Vagyeeyakaras

List B - Five compositions of "Sangeetha Sahitya Kalanidhi" Sriman N.Ch. Krishnamacharyulu garu :

- Sree Varaha Narasimha – Kedaram – Roopaka taalam
- Gowri Sukumari – Vasantha - Aadi
- Sree KanakaDurge – Kalyani - Aadi
- MaaraJananeem – Naatakapriya - Aadi
- Nee Pada Saarasa – Hemavathi – Roopaka taalam.

Candidates have to sing one composition from "List A" or "List B" with Raagalaapana, Neraval and Swarakalpana of his/her choice (15 mins) and another of judge's choice from the other group (5mins).

**Rules and Regulations:**

- No entry fee
- Candidates have to take a printout and send the duly filled in scanned copy of applications to any of two numbers through WhatsApp- 9440323555, 9949070900
- Last date for receiving applications is 30-09-2020. No entries are accepted after 30-09-2020.
- Compositions of Sriman N.Ch. Krishnamacharyulu garu will be shared through WhatsApp to the enrolled participants.

- Organising committee will inform the candidates about the items to be presented on 13-11-2020.
- Candidates have to send a video recording of the allotted items on or before 15-11-2020 in Landscape mode only to krishnamacharyakalapeetham@gmail.com.
- Videos received after 15-11-2020 will not be accepted.
- Candidates should be in traditional dress while performing.
- Candidates should use only a tambura/shruti box, no accompaniments are allowed.
- Candidates should ensure that the audio and video are clear, based on which judgement will be made. Organisation will present the videos as received and will not be responsible for clarity issues if any in this regard.
- Candidate's performance will be scrutinized by primary panel before presenting them to eminent Judges, based on the number of applications received.

**Link to apply:** https://forms.gle/d367TYcgZ6bSTXjcA

- All the performances will be telecasted on our **Facebook page** Krishnamacharya Kala Peetham: https://www.facebook.com/KrishnamacharyaKalaPeetam/

- Results will be announced on 18th anniversary of Krishnamacharya Kala peetham (probable date : 29-11-2020). Judges decision will be final.

**Cash awards for juniors:**

- First Prize - Rs.3000/-
- Second Prize - Rs.2000/-
- Third Prize - Rs 1000/-

**Cash awards for seniors:**

- First Prize - Rs.5000/-
- Second Prize - Rs.3000/-
- Third Prize - Rs.2000/-

- Candidates are requested to follow all the updates regarding competitions on our FB page mentioned above.
- For any further queries contact:

| | |
|---|---|
| NCH B Acharyulu | 9440323555 |
| NCH Chakravarthy | 9399958069 |

Organizing Committee,
Krishnamacharya Kala Peetham.

# ఆహ్వానము

# కళార్ణవ - 2020

## ప్రపంచవ్యాప్త భారతీయ కళా పోటీలు

**ఈ ప్రపంచానికి అవధులు లేని అంతర్ముఖమైన నీ ప్రతిభను జాగృతం చేసి చాటిచెప్పు**




**అక్టోబర్**
**26, సోమవారం, 2020**

**వివరాలకు :**
నాట్యాచార్య **హెచ్.కె.కె. చైతన్యప్రభు,** ఎమ్.ఏ., డ్యాన్స్
**సెల్ : 99127 79093**

నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ అకాడమీ, సింహాచలం
Email : nrityanjali.spiritofartacademy@gmail.com

ఆశీస్సులతో...

# కళార్ణవ విద్వత్ప్రదర్శన పోటీలు - 2020

## నృత్య విభాగం | ప్రవేశ రుసుము రూ.500/-

| కళ | సబ్-జూనియర్స్ | జూనియర్స్ | సీనియర్స్ | సూపర్ సీనియర్స్ | విధి విధానాలు |
|---|---|---|---|---|---|
| వయస్సు | 7 సం॥లోపు | 8-14 సం॥లు | 15-25 సం॥లోపు | 26 సం॥ పైబడి | |
| భరతనాట్యం | ఏదైనా అంశం (తిల్లాన, కౌతం, పుష్పాంజలి, మల్లారి, అలరిప్పు, కీర్తన) 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (జతిస్వరం, తిల్లాన, కౌతం, తరంగం, కీర్తన) 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (జతిస్వరం, తిల్లాన, వర్ణం, తరంగం, కీర్తన) 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (జతిస్వరం, తిల్లాన, వర్ణం, పదం, జావళి, తరంగం, కీర్తన, భరతనాట్య సంప్రదాయం అనుసరించి ప్రసిద్ధమైన ఏ అంశమైనా నర్తించవచ్చు) 10 నుంచి 15 నిమిషాల నిడివి మాత్రమే | 1. ఆహార్యం (మేకప్, డ్రెస్, హెయిర్ స్టైల్, జ్యూయలరీ) ఆంగికం (ఫుట్ వర్క్ మరియు పెర్ఫార్మెన్స్) వాచకం (సాంగ్ సెలక్షన్ అండ్ ఎకంపెనీ మ్యూజిక్) సాత్వికం (రసాభినయం, ఎక్స్‌ప్రెషన్ & ఫీలింగ్) పై 4 నిబంధనలు న్యాయనిర్ణేతల పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. (జడ్జిమెంట్ సబ్జెక్ట్) వాటి ప్రాధాన్యత తగ్గకుండా ప్రదర్శనాంశము ఉండాలి.<br>2. తీసే వీడియో 60 పైగా మెగా పిక్సెల్ కెమెరా ఉపయోగించి ల్యాండ్‌స్కేప్ అనగా అడ్డంగా తీసి.. ఆ వీడియోకి కైన్‌మాస్టర్ లేదా ఏ ఇతర ఆప్ ద్వారా ఒరిజినల్ ఆడియో, వీడియోకి సెట్ చేసి నీట్‌గా ఎడిట్ చేసి మాకు పంపవలెను. తద్వారా మీ వీడియో క్లారిటీ బ్రాడ్‌కాస్ట్ చేసేటప్పుడు క్వాలిటీగా కనబడును.<br>3. వీడియోగ్రఫీ ఎక్కువ లైటింగ్‌లో తీసినదై బ్యాక్ గ్రౌండ్ ప్లెయిన్ లేదా తెర గానీ లేదా విశాలమైన ప్లెయిన్ గోడ గాని ఉండాలి. మరియు ఖచ్చితంగా వీడియో ఇప్పటిదై రీసెంట్‌గా తీసినదై ఉండాలి. వేరే సంస్థలలో గానీ మీ సంస్థలో గానీ లేదా వెనకాల ఏ విధమైన బ్యానర్ ఉన్న వీడియోన్‌ను నిష్పక్షపాతంగా నిరాకరింప బడును. ఈ విషయమై నిర్వాహకులదే తుది నిర్ణయం. |
| కూచిపూడి | ఏదైనా అంశం (కౌతం, బ్రహ్మాంజలి, ఝుణుత శబ్దం, కీర్తన) 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (జతిస్వరం, అధ్యాత్మ రామాయణ, కీర్తన, శబ్దం, తరంగం, కీర్తన) 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (దరువులు, కలాపం, పదం, జావళి, కీర్తన, తరంగం, శబ్దం) 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (కూచిపూడి సంప్రదాయం అనుసరించి ప్రసిద్ధమైన ఏ అంశమైన నర్తించవచ్చు) 10 నుంచి 15 నిమిషాల నిడివి మాత్రమే | |
| ఆంధ్రనాట్యం | ఏదైనా అంశం (కౌతం, పుష్పాంజలి, శబ్దం, కీర్తన) 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (శబ్దం, కైవారం, కౌతం, కీర్తన) 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (తరంగం, అధ్యాత్మ రామాయణ కీర్తన, నవ జనార్ధన పారిజాతం (ఏదైనా దరువు) శబ్దం, కీర్తన) 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (అధ్యాత్మ రామాయణ కీర్తన, నవ జనార్దన పారిజాతం, పదం, జావళి, కీర్తన ఆంధ్రనాట్యం సాంప్రదాయాన్ని అనుసరించి ప్రసిద్ధమైన ఏ అంశమైనా నర్తించవచ్చు) 10 నుంచి 15 నిమిషాల నిడివి మాత్రమే | |
| పేరిణి నాట్యం | లేదు | ఏదైనా అంశం (మేళప్రాప్తి, తహనాలు) 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (యతి విన్యాసాలు, మేళప్రాప్తి) 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా అంశం (పంచముఖ శబ్దాలు, పేరిణినాట్యం సాంప్రదాయాన్ని అనుసరించి ప్రసిద్ధమైన ఏ అంశమైనా నర్తించవచ్చు) 10 నుంచి 15 నిమిషాల నిడివి మాత్రమే | |

## సంగీత విభాగం

## ప్రవేశ రుసుము రూ.500/-

| కళ | సబ్-జూనియర్స్ | జూనియర్స్ | సీనియర్స్ | సూపర్ సీనియర్స్ | విధి విధానాలు |
|---|---|---|---|---|---|
| వయస్సు | 7 సం॥లోపు | 8-14 సం॥లు | 15-25 సం॥లోపు | 26 సం॥ పైబడి | |
| శాస్త్రీయ సంగీతం | ఏదైనా గీతము లేక కీర్తన లేక వారికి వచ్చిన శాస్త్రీయ సంగీతం సమయం 5 ని॥ నిడివి మాత్రమే | ఏదైనా రెండు అంశములు 1. గీతము మరియు 2. స్వరజతి లేక స్వరవల్లివి (లేక) 1. స్వరజతి లేక తాన వర్ణము మరియు 2. ఏదైనా కీర్తన (త్యాగరాజు. అన్నమయ్య రామదాసు) సమయం : 5 నుండి 7 ని॥ నిడివి మాత్రమే | ఏదైనా రెండు అంశములు 1. పదవర్ణము లేక రాగమాలికా వర్ణము మరియు 2. ఏదైనా కీర్తన (త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి) నిడివి 10 నుండి 20 ని॥ మాత్రమే | ఏదైనా రెండు అంశములు 1. ఏదైనా త్యాగరాజ పంచరత్న కీర్తన లేక అటతాళ వర్ణము మరియు 2. రాగాలాపన, నెరవుతో ఏదైనా కీర్తన (త్యాగరాజస్వామి, దీక్షితార్, శ్యామశాస్త్రి, పురందరదాసు) నిడివి 20 నుండి 30 ని॥ మాత్రమే | 1. సబ్ జూనియర్స్, జూనియర్స్ కంపల్సరీ తంబురా శృతిపెట్టి కుదిరితే నేపథ్యంతో పాడ వలెను.<br>2. సీనియర్ మరియు సూపర్ సీనియర్స్ కంపల్సరీ వాయిద్య సహకారంతో లేదా ట్రాక్ రికార్డింగ్ ఉపయోగించి పాడవలెను. మరేదైన ఇతర ఇబ్బందులు ఉన్న మమ్ము సంప్రదించగలరు. తగు పరిష్కారం ఉండును.<br>3. పాత సినీ సంగీతము మరియు కొత్త సినీ సంగీతము విభాగాల వారు అందరూ నేపథ్యంతో కుదిరితే లేదా ట్రాక్‌లో కంపల్సరీ పాడవలెను.<br>తీసే వీడియో 60 ఎబోవ్ మెగాపిక్సెల్ కెమెరా అయి ల్యాండ్ స్కేప్ అనగా అడ్డంగా ✗ ✓ ఆ వీడియోగ్రఫీ చేసేటప్పుడు సరియైన మైక్ ఉపయోగించి ఒరిజినల్ ఆడియో, వీడియో సెట్ చేసి నీట్‌గా ఎడిట్ చేసి మాకు పంపవలెను. వీడియోలో ఖచ్చితంగా పార్టిసిపెంట్ లైవ్‌లో కంపల్సరీ ఉండాలి. వీడియోగ్రఫీ ఎక్కువ లైటింగ్ ఉన్న ప్లెయిన్ బ్యాక్‌గ్రౌండ్, తెర లేదా గోడ ఉండేటట్లు మరియు ఖచ్చితంగా ఇప్పటిదై రీసెంట్‌గా తీసినదై ఉండాలి. వేరే సంస్థలు లేదా స్వసంస్థలో గాని లేదా వెనకాల ఏ విధమైన బ్యానర్ ఉన్న వీడియో నిష్పక్షపాతంగా నిరాకరింపబడును. ఈ విషయమై నిర్వాహకులదే తుది నిర్ణయం. |
| సరళ శాస్త్రీయ సంగీతం | లేదు | ఏదైనా పాట 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాల నిడివి నేపథ్యం లేదా రిథమ్ యాప్ (జల్‌రా, మృదంగం, తాళ)తో పాడవలెను | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాలనిడివి నేపథ్యంతో పాడవలెను | |
| సినీ శాస్త్రీయ సంగీతం | ఏదైనా పాట శాస్త్రీయ నేపథ్యంలో 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట శాస్త్రీయ నేపథ్యంలో 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట శాస్త్రీయ నేపథ్యంలో 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట శాస్త్రీయ నేపథ్యంలో 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | |
| పాత సినిమా పాటలు | ఏదైనా పాట 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | |
| క్రొత్త సినిమా పాటలు | ఏదైనా పాట 5 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 7 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | ఏదైనా పాట 5 నుంచి 10 నిమిషాల నిడివి మాత్రమే | |

## చిత్రలేఖన విభాగం — ప్రవేశ రుసుము రూ.500/-

| కళ | సబ్-జూనియర్స్ | జూనియర్స్ | సీనియర్స్ | సూపర్ సీనియర్స్ |
|---|---|---|---|---|
| వయస్సు | 7 సం॥లోపు | 8-14 సం॥లు | 15-25 సం॥లోపు | 26 సం॥ పైబడి |
| చిత్ర లేఖనం | ఏదైనా అంశం వారి ఇచ్ఛ (మెటీరియల్స్ : క్రేయాన్స్, కలర్ పెన్సిల్స్, ఆయిల్ పాస్టెల్స్, ఎ4 పేపర్ సైజ్) | టాపిక్ ఉంటుంది (మెటీరియల్స్ : ఆయిల్ పేస్టెల్స్, వాటర్ కలర్, పోస్టర్ కలర్స్, ఎ3 పేపర్ సైజ్) టాపిక్ : ప్రస్తుత సమాజ పరిస్థితి – అవేర్‌నెస్ (లేదా) మీ "కలల ప్రపంచం" | ఓన్ క్రియేటివిటి లేదా మోడ్రన్ అర్ట్ (మెటీరియల్స్ : ఎనీ మీడియం, ఎ3 పేపర్ సైజ్ లేదా కాన్వాస్) | బెస్ట్ అఫ్ దెయిర్ వర్క్ (ఎనీ మీడియం) |

### విధి విధానాలు

1. అభ్యర్థులు తప్పనిసరిగా వర్కింగ్ వీడియోని నీట్‌గా ఎడిట్ చేసి పెట్టాలి. అలాగే ఆర్ట్ ది కెమెరా హెచ్‌డి పిక్ జెపిజిలో మాకు ఎలాంగ్ విత్ వీడియో పంపాలి. మరేమైన ఇతర ఇబ్బందులు ఉన్న మమ్ము సంప్రదించగలరు. తగు పరిష్కారం ఉండును.
2. తీసే వీడియో 60 పైన మెగా పిక్సెల్ కెమెరా ఉపయోగించి లాండ్ స్కేప్ అనగా అడ్డంగా ❌ ✅ తీసి, ఆ వీడియోకి సరైన మైక్ ఉపయోగించి ఒరిజినల్ ఆడియో, వీడియోకి సెట్ చేసి నీట్‌గా ఎడిట్ చేసి మాకు పంపవలెను.

వీడియోగ్రఫీ ఎక్కువ లైటింగ్‌లో తీసినదై బ్యాక్ గ్రౌండ్ ప్లెయిన్ లేదా తెర గానీ లేదా విశాలమైన ప్లెయిన్ గోడ గాని ఉండాలి. మరియు ఖచ్చితంగా వీడియో ఇప్పటిదై రీసెంట్‌గా తీసినదై ఉండాలి. వేరే సంస్థలలో గానీ మీ సంస్థలో గానీ లేదా వెనకాల ఏ విధమై బ్యానర్ ఉన్న వీడియోస్‌ను నిష్పక్షపాతంగా నిరాకరించబడును. ఈ విషయమై నిర్వాహకులదే తుది నిర్ణయం.



# కళార్ణవ శ్రేష్ఠ పురస్కార వేడుకలు

శ్రేష్ఠ పురస్కారములు వయో పరిమితితో నిమిత్తం లేకుండా అత్యంత విశిష్టమైన ప్రతిభ చూపు జిజ్ఞాస ఉన్న ప్రతీ కళాకారుని అలాగే భారతీయ సాంప్రదాయాలలో ఏ నృత్యరీతి అయినా ఏ సంగీత సాంప్రదాయమైన ఎటువంటి కళాప్రదర్శన చేయాలి అనే ఆలోచన ఉన్న ప్రతిభాశాలియైన కళాకారులకు నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ అకాడమీ కళార్ణవ ద్వారా వారికి వేదిక కల్పించి వారిని అత్యంత విశిష్టంగా సత్కరింప సంకల్పించింది.

## "గురుశ్రేష్ఠ" పురస్కారం

30 ఏళ్ళు పైబడినవారు మరియు పురస్కార స్థాయి ప్రదర్శన చేయువారు దీనికి ఎవరైనా అర్హులు.

## 'యువ శ్రేష్ఠ' పురస్కారము

16 ఏళ్ళ వయస్సు నుండి 29 ఏళ్ళ వయస్సు వారు కళలో అత్యంత ప్రతిభా పాటవాలు చూపగలం అని అనుకున్నవారు, ప్రతిభ చూపు సమర్ధులు దీనికి అర్హులు.

## 'బాలశ్రేష్ఠ' పురస్కారము

5 ఏళ్ళ పయస్సు నుండి 15 ఏళ్ళ పయస్సు వారు కళలో అత్యంత ప్రతిభా పాటవాలు చూపగలం అని అనుకున్న వారు ప్రతిభ చూపు సమర్ధులు దీనికి అర్హులు.

*'గురు శ్రేష్ఠ', 'యువ శ్రేష్ఠ' 'బాలశ్రేష్ఠ' పురస్కారములు ప్రతీ శాస్త్రీయ నృత్య, సంగీత, చిత్రలేఖన విభాగములలో అభ్యర్ధన చేసుకోవచ్చు, అలాగే ఏ భారతీయ నృత్య సాంప్రదాయమైనా, ఏ భారతీయ సంగీత సాంప్రదాయమయినా అభ్యర్ధనకు అర్హులు. నృత్య, సంగీత విభాగములకు ప్రదర్శన సమయం 20 నుంచి 30 నిమిషాల నిడివి ఇవ్వబడును. ప్రవేశ రుసుము 1000 రూ. దీనికి అప్లై చేసిన వారిని కళార్ణవ జూరి సెలెక్షన్ కమిటీ వారిచే ఎన్నుకోబడిన కళాకారులకు ఈ పురస్కారంతో సత్కరించటం జరుగుతుంది. ఎన్నుకోబడని అభ్యర్థులకు 'కళార్ణవ-2020 ఉత్తమ కళాకారుడు(కారిణి)' పురస్కారముతో సత్కరించబడును.*

## "కళార్ణవ 2020 ఉత్తమ కళాసంస్థ" పురస్కారము

కళార్ణవ పురస్కారాలు, బహుమతులు 2020లో అత్యధికంగా గెలుచుకున్న కళాసంస్థకు ఈ పురస్కారం ఇవ్వడం జరుగుతుంది.

## "కళార్ణవ 2020 కళాసంస్థ" విశేష ప్రతిభా పురస్కారము

కళార్ణవ పురస్కారాలు బహుమతుల పోటీకి 2020లో అత్యధిక అభ్యర్థులను పోటీలలో పాల్గొనేటట్లు కృషి చేసిన కళాసంస్థకు ఈ పురస్కారం ఇవ్వడం జరుగుతుంది.

## నియమ, నిబంధనలు

1. గురువుగారి అంగీకారముతోనే దరఖాస్తులు స్వీకరింవబడును, అనుమతి తప్పనిసరి.
2. పాల్గొనే కళాకారులు నృత్య నంగీత చిత్ర లేఖన విభాగాలలో ఏ విభాగంలోనైనా, ఏ అంశంలోనైనా లేక అన్నింటిలోనూ పాల్గొనే అవకాశం అందరికీ కలదు. కాకపోతే ఏ విభాగంలోనైనా అందలి అంశంలో ఒకసారి మాత్రమే పాల్గొనే అవకాశం కలదు.
3. మీరు పంపించు వీడియోలు క్వాలిటీ, క్లారిటీ ఖచ్చితంగా వుండాలి, వెనుక ఎటువంటి పేరు గల బ్యానర్ ఉండరాదు.
4. మీరు ఎడిట్ చేసిన వీడియోస్‌ని జాగ్రత్తగా గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేసి అందలి "కెన్ ఎడిట్ ఎనీవన్" అనే అప్షన్‌తో kalarnava.nrityanjali@gmail.com కి షేర్ వేయాలి
3. దరఖాస్తుదారులు వీడియో మెయిల్ చేసిన తర్వాత, అభ్యర్థుల పూర్తి వివరములు, మేకప్‌తో 2 ఫోటోలు, గురువుగారి ఫోటో, నాట్యసంస్థ వివరములు తెలుపవలెను.
4. దరఖాస్తుల పూర్తి వివరములు సెప్టెంబర్ 30, 2020 లోగా kalarnava.nrityanjali@gmail.com షేర్ చేయాలి. దరఖాస్తులు అక్టోబర్ 3, 2020 లోగా ఖచ్చితంగా పంపవలెను.
5. విద్వత్ప్రదర్శన పోటీల ప్రవేశ రుసుము రూ.500/-
6. గురుశ్రేష్ఠ పురస్కారాలకు ఎంట్రీ ఫీజు రూ.1000/-
7. ఎంట్రీఫీజు గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం నెం.9912779093 కి గాని లేదా అకౌంట్ నెం.474202010014282, IFSC : UBIN0547425, పేరు హెచ్.కె.కె. చైతన్య ప్రభు కి పంపవలెను.
8. ఫీజు చెల్లించిన తరువాత ట్రాన్సాక్షన్ ఐడి మరియు అభ్యర్థులు ఏ విభాగంలో పాల్గొంటున్నారో ధృవీకరించి మాకు వెంటనే వాట్సాప్ నెం.9912779093 ద్వారా మాకు పంపినయెడల మీకు వెంటనే కళార్ణవ పే-స్లిప్ మరియు అప్లికేషన్ పంపించడం జరుగుతుంది మరియు రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం ముగుస్తుంది.
9. ఎన్‌రోల్ అయిన అభ్యర్థులు ఖచ్చితంగా అప్లికేషన్‌ను పూర్తిచేసి వెంటనే kalarnava.nrityanjali@gmail.com కి పంపవలెను.

designed by : simhadri@8523864567

# సంగీత క్షీరసాగరం - హైదరాబాదు 18వ వార్షికోత్సవం


6-9-20 కుమారి అంజన - చెన్నై - వీణ కచేరి


7-9-20 శ్రీ సి.వి.పి. శాస్త్రి - విజయవాడ - గాత్రం


8-9-20 శ్రీ ఎన్.రామమూర్తి - హైదరాబాదు - గాత్రం


9-9-20 శ్రీమతి శ్వేతా ప్రసాద్ - హైదరాబాదు - గాత్రం


10-9-20 శ్రీ ఎస్.ఎమ్.సుభాని - హైదరాబాదు - మాండలిన్


11-9-20 శ్రీమతి అంజనీ శివకుమార్ - హైదరాబాదు - గాత్రం


12-9-20
శ్రీ ఎన్.సి.హెచ్. కౌశిక్ కళ్యాణ్ - హైదరాబాదు - గాత్రం

# శ్రీరామ సమాజం (రి) కాకినాడ వారి 126వ సంగీత హరికథా మహోత్సవాలు

కాకినాడలోని ప్రాచీన ఉచిత సంగీత పాఠశాలతో కూడిన సంగీత సంస్థ 1894లో ప్రారంభించబడి126 సంవత్సరాలుగా సంగీత సేవ అందిస్తున్నది. కాకినాడ కృష్ణయ్యర్ గారి (శ్రీ పట్నం సుబ్రహ్మణ్యఅయ్యర్ గారి శిష్యులు) శిష్యులైన శ్రీ మునుగంటి శ్రీరాములు పంతులుగారిచే స్థాపించబడి గురుకుల వాస పద్ధతిలో శిష్యులకు సంగీత బోధన చేసిన ఈ సంస్థ భారతదేశంలోనే ప్రాచీనమైన సంస్థ. శ్రీరాముల గారి తరువాత గాయక సామ్రాట్ మునుగంటి వెంకట్రావు పంతులుగారు తదనంతరం వారి కుమారుడు గానకళ సంగీత మాసపత్రిక సంస్థాపకులు శ్రీ మునుగంటి శ్రీరామమూర్తి తదుపరి నాల్గవ తరం వారైన శ్రీ మునుగంటి వెంకట్రావు ప్రధానకార్యదర్శిగా సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. శ్రీ రాయవరపు మృత్యుంజయరావుగారు, శ్రీఎమ్.ఎస్.రాఘవరావు గారు ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు అధ్యక్షులు.

కరోనా వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదురైన ఎలాగైనా సంగీత కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించి ఆగష్టు 22 నుండి 27 వరకు సంగీత హరికథా మహొత్సవాలను నిర్వహించింది శ్రీరామసమాజం. 22వ తారీఖున శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు గాత్రకచేరికి శ్రీ మహదాసు శ్యామనీలాద్రిరావు, విజయనగరం వైలన్ పై శ్రీ మహదాసు ఏడుకొండలు గారు మృదంగంపై సహకరించగా చక్కని సంగీత కచేరి వినిపించారు.

లంబీజరూపాయ – గౌళ – ఆది – స్వీయరచన, శనైశ్చరాయ – శంకరాభరణం – ఆది – స్వీయరచన, శేషాచలనాయకం – వరాళి రూపకం – దీక్షితార్, రామానీయడ – ఖరహరప్రియ – ఆది – త్యాగరాజు, నారాయణ యనరాదా – సింధుభైరవి – ఆది – రామదాసు అంశాలు వినిపించారు.

రెండవరోజు శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి తమ గాత్ర కచేరి శ్రీ మహదాసు ఏడుకొండలు వైలెన్ పై, శ్రీ వారణాసి శ్రీనివాస్ మృదంగంపై, శ్రీ అనిల్‌కుమార్ ఘటంపై సహకరించగా రక్తిగా సాగింది.

సావేరి వర్ణం, గిరిజాసుత, ఆడమోడి కలదే, తొలినే చేసిన, వాసుదేవయని, స్మరవారం అంశాలను వినిపించారు.

మూడవరోజు 24వ తేది విజయనగరం నకు చెందిన ఏ గ్రేడు కళాకారులు శ్రీ మహదాసు శ్యామనీలాద్రిరావు వైలెన్ సోలో కచేరి శ్రీ మహదాసు ఏడుకొండలు (ఎ గ్రేడ్ విద్వాంసులు), శ్రీ సరస్వతుల హనుమంతరావు (తాడేపల్లిగూడెం) ఘటంపై సహకరించగా రక్తిగా సాగింది.

గజాననయుతం – చక్రవాకం – దీక్షతార్; అన్నపూర్ణే విశాలాక్షి – సామ –దీక్షితార్; రారా మా యింటిదాకా – అసావేరి– త్యాగరాజు; కమలాంబ – కానడ – సుబ్బరాయశాస్త్రి ; మరివేరేదిక్కెవరయ్య రామా – షణ్ముఖప్రియ – త్యాగరాజు; గోవర్ధనగిరి – దర్బారీకానడ – నారాయణతీర్థ; విశ్వేశ్వర దర్శన – సింధుభైరవి – స్వాతి తిరునాళ్ అంశాలు చోటు చేసుకున్నాయి.

ఈ పై మూడు కార్యక్రమాలు కాకినాడ శ్రీరామసమాజ భవనము నుండి ప్రత్యక్షప్రసారం కాబడ్డాయి.

25వ తేదీన చెన్నై నుండి శ్రీ సునీల్ గార్గేయన్ గాత్ర సంగీతసభ జరిగింది. వీరికి శ్రీ సాయిరక్షిత్ – చెన్నై – వయొలిన్‌పై, శ్రీ కలిదైకుర్చి శివకుమార్ – చెన్నై – మృదంగం పై సహకరించారు.

దీక్షితార్ – సిద్ధి వినాయకం సతతం; ఏతావున నేర్చితివో – యదుకుల కాంభోజి – త్యాగరాజు; ఘనుడెవ్వడో దాశరథే – మలయ మారుతం – పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ రచన, పరితాపముల దీర్చి – కన్నడ–రామ్నాడ్ శ్రీనివాసయ్యంగార్ రచన; ఎన్నాళ్ళూరకే – శుభపంతువరాళి – త్యాగరాజు; మంగళం అంశాలు వినిపించారు.

26వ తేదీన చెన్నై నుండి శ్రీమతి బృందమాణికవాసకన్ గాత్ర సంగీత సభకు శ్రీ బి.అనంతకృష్ణన్ – చెన్నై – వయోలిన్ పై, శ్రీ బి.గణపతి రామన్ – చెన్నై – మృదంగంపై, శ్రీ అనిరుద్ ఆత్రేయ – చెన్నై – కంజిర పై సహకరించారు.

శ్రీ గణపతిని సేవింపరారే; రామభక్తి–శుద్ధబంగ్లా, నన్ను విడచి – రీతిగౌళ; నిన్నాడనేల; రామకథా – మధ్యమావతి; సుందర దశరథ – కాపి; తవదాసోహం –పున్నాగవరాళి అంశాలు వినిపించారు.

27వ తేదీన హైదరాబాదుకు చెందిన శ్రీమతి విజయ వల్లి భరద్వాజ్ (ఏలేశ్వరపు విజయవల్లి భాగవతారిణి) 'గజేంద్రమోక్షణ' హరికథను భావస్ఫోరకంగా, ఆధ్యాత్మిక తత్త్వ ప్రతిబోధకంగా, రసవత్తరంగా వినిపించారు. శ్రీ పురిహెళ్ళ భరద్వాజ్–హైదరాబాదు–వయొలిన్, శ్రీ వేమూరి వాసుదేవమూర్తి–హైదరాబాదు–మృదంగంపై చక్కని సహకారం అందించారు. కార్యక్రమాలను అధ్యక్షులు శ్రీ రాజారావు, నిర్వహణ కార్యదర్శి శ్రీ రాయవరపు సీతారామాంజనేయులు, సహకార్యదర్శి శ్రీ ఎమ్.వి.జి. కృష్ణంరాజు, శ్రీ విష్ణు భట్ల శ్రీరామచంద్రమూర్తి, మహిళావిభాగ అధ్యక్షురాలు శ్రీమతి రాయవరపు బదరీ విశాలాక్షి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి శుభారంభం చేసారు. చివరి మూడు కార్యక్రమాలు యూ ట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కాబడ్డాయి.

23వ తారీఖున హైదరాబాదు వాస్తవ్యులు ప్రముఖ సంగీతప్రియులు శ్రీ వై.శ్రీవత్స, డా॥ శ్రీమతి వై.రమాప్రభ దంపతులు, సద్గురువులు శ్రీ కాకరపర్తి వీరభద్రరావు సంస్మరణగా ప్రముఖ సంగీత విద్వాంసులు, సంగీత గురువులు శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గారి సంగీత సేవను ప్రశంసిస్తూ, ప్రత్యేక అవార్డును అందచేసారు. ఈఅవార్డు క్రింద నగదు బహుమతి, ప్రశంసాపత్రం, శాలువా అందచేసారు సమాజ అధ్యక్షులు శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు, నిర్వహణ కార్యదర్శి శ్రీ రాయవరపు సీతారామాంజనేయులు. ఈ అవార్డు తనకు అందించినందుకు శ్రీ శ్రీవత్స, శ్రీమతి రమాప్రభ దంపతులకు ,శ్రీరామ సమాజ కార్యవర్గానికి శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి కృతజ్ఞతలు తెలియజేసారు.

24వ తేదీన ఈ మధ్యనే వయెలిన్ విభాగంలో ఆకాశవాణి వారి ఏ గ్రేడ్ పొందిన ప్రముఖ వయెలిన్ విద్వాంసులు శ్రీ మహదాసు శ్యామనీలాద్రిరావు గారిని శ్రీరామసమాజం కార్యవర్గం అభినందిస్తూ సత్కారం అందించింది.

ఈ ఏడు రోజులు కార్యక్రమాలు ఫేస్‌బుక్ ద్వారా, యూ ట్యూబ్ ద్వారా దేశ విదేశాలనున్న సంగీతప్రియులకు అందచేయడం జరిగింది. కార్యదర్శి మునుగంటి వెంకట్రావు కళాకారులను పరిచయం చేసి, చివరి రోజున సహకరించిన సమాజ సభ్యులందరికి, కార్యక్రమాలను ఆర్థికంగా ప్రోత్సహించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.